

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 229 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం, 19, జులై 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# సామాన్యుల శాపాలతో.. హైడ్రాకు రెండేళ్లు !



ప్రజా ఆస్తికి కవచమా..? సామాన్యుడి కలలకు బుల్డోజరా..?

రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ ఆస్తి రక్షణ అని సర్కార్ లెక్కలు

3,311 ఎకరాల స్వాధీనం... 1,378 ఆక్రమణల తొలగింపు

చెరువులు బతికాయంటున్న అధికారులు... బతుకులు కూలిపోయాయంటున్న బాధితులు

అక్రమాలపై ఉక్కుపాదం సరే... బాధ్యులపై చర్యలు ఎక్కడ?

పునరావాసం, పారదర్శకత, సమాన న్యాయం కోరుతున్న నగరవాసులు








హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలను అరికట్టేందుకు ఏర్పాటైన హైడ్రా రెండేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ కాలంలో 1,378 ఆక్రమణలను తొలగించి 3,311 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నామని, రూ.1.50 లక్షల కోట్ల ప్రజా ఆస్తిని రక్షించామని ప్రభుత్వం చెబుతోంది. అయితే ప్రభుత్వ అనుమతులను నమ్మి ఇళ్లు కొనుగోలు చేసిన వందలాది కుటుంబాలు కూల్చివేతలతో రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపడం సమర్థనీయమే అయినా, బాధ్యులైన బిల్డర్లు, అధికారులపై చర్యలు ఎక్కడన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పునరావాసం, పారదర్శకత, సమాన న్యాయమే హైడ్రా విజయానికి అసలైన కొలమానమని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు. దీంతో హైడ్రా రెండేళ్ల ప్రయాణం విజయాలు, వివాదాలు, విమర్శల మధ్య నగరవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

2

– హైదరాబాద్(జై భీమ్ డెస్క్)



డాక్టర్
బరిగెల శివ
జై భీమ్ సంస్థల
ఫౌండర్, చైర్మన్

## లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ

కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా

ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి

తెలంగాణలో లూటీ జరుగుతోంది

మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోంది

చాయ్ పే చర్చాను మరచిన రాహుల్

బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ ఘాటు విమర్శలు



5

## ఆహార కల్తీపై కఠిన చట్టం

ఆహార, ఔషధాల కల్తీ నివారణకు సమగ్ర చట్టం రూపొందించాలని సీఎం రేవంత్ ఆదేశం

ప్రపంచ దేశాల విధానాలను అధ్యయనం చేసి బిల్లు సిద్ధం చేయాలని సూచన

విజిల్‌బ్లోయర్ వ్యవస్థ, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయనున్న ప్రభుత్వం

సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక వ్యవస్థపై దృష్టి

క్యూర్ ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసి రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ



4

## స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలి

16 నుండి 26 వరకు ‘బోనాలు- చేతివృత్తుల మేళా‘

ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శనలు

మంత్రి పొన్నం ప్రభాకర్



5

## దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ

'విక్రమ్-1' విజయవంతంపై రేవంత్ హర్షం

హైదరాబాద్,జూలై18(జై భీమ్ న్యూస్) :

భారత్ తొలి ప్రైవేట్ అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. 'హైదరాబాద్ రైజింగ్.. తెలంగాణ రైజింగ్' అంటూ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1' విజయవంతమైన ప్రయోగమన్నారు. శ్రీహరికోట నుంచి విక్రమ్-1 నింగిలోకి దూసుకెళ్లిందని, హైదరాబాద్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ ఘన విజయం సాధించిందని తెలిపారు. భారత అంతరిక్ష రంగం మరో చారిత్రక మైలురాయిని చేరుకుందన్నారు. దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ నిలిచిందని సీఎం అన్నారు. హైదరాబాద్ ఇన్నోవేషన్ శక్తికి ప్రపంచ వేదికపై గుర్తింపు లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా స్కైరూట్ బృందానికి ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. విక్రమ్-1.. ప్రైవేట్ స్పేస్ రంగంలో భారత్ సత్తా చాటిందని కొనియాడారు. భవిష్యత్తు అంతరిక్ష ప్రయాణాలకు తెలంగాణ నుంచి బలమైన అడుగు పడిందని ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.



# అనుమతి లేని 'ఫిజిక్స్ వాలా' జూనియర్ కాలేజీని మూసివేయాలి

**యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి: స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ డిమాండ్**




**హన్మకొండ, 18 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ నగరంలో అనుమతులు లేకుండా 'ఫిజిక్స్ వాలా' పేరుతో జూనియర్ కాలేజీ నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ, సంబంధిత అధికారులు వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ, సరైన కాలేజీ నిర్మాణం, అనుమతులకు సంబంధించిన వివరాలపై స్పష్టత లేకుండానే విద్యార్థుల నుంచి అడ్మిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. డే స్కాలర్ విద్యార్థుల నుంచి రూ. 1.15 లక్షల వరకు ఫీజుతో పాటు రూ.15 వేల డొనేషన్ పేరుతో వివిధ రకాలుగా అధిక మొత్తాలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. కాలేజీ నిర్వహణ, చైర్మన్‌కు సంబంధించిన వివరాలను విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నించినప్పుడు యాజమాన్య ప్రతినిధుల నుంచి స్పష్టమైన సమాధానాలు రావడం లేదని సాయికుమార్ ఆరోపించారు. విద్యార్థుల రవాణా కోసం రెండు వేర్వేరు పేర్లతో బస్సులు నడుపుతున్నట్లు కూడా ఆయన పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో కాలేజీ నిర్వహణపై అనుమానాలు నెలకొన్నాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) వెంటనే స్పందించి కాలేజీ అనుమతులు, ఫీజుల వసూళ్లు, నిర్వహణకు సంబంధించిన అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. అవసరమైన అనుమతులు లేకుండా కాలేజీ నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలితే తక్షణమే మూసివేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎల్తూరి సాయికుమార్ డిమాండ్ చేశారు.

# మృతుని కుటుంబానికి పరామర్శ



**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు మండలంలోని నాగపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనుముల రాములు మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సమ్మట మహేందర్ గౌడ్ వారి నివాసానికి వెళ్లి భౌతిక దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉప సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు బరిగెల భాస్కర్, మండలం అధికార ప్రతినిధి కొత్తూరి సునీల్ ఒంటిమామిడిపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు గిర్క.రాజు ఒంటిమామిడిపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ కొట్టం.రాజు అనుముల బుచ్చిరెడ్డి కద్దూరి.నర్సిరెడ్డి సీనియర్ నాయకులు పెందల వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# గోల్ఫ్ టూరిజం అభివృద్ధిపై కపిల్ దేవ్‌తో మంత్రి కందుల దుర్గేష్ చర్చలు




**అమరావతి, జులై 18 (జై భీమ్ న్యూస్):**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గోల్ఫ్ టూరిజం అభివృద్ధి, తద్వారా పర్యాటక రంగాన్ని బలోపేతం చేసే అంశాలపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నోయిడా (ఢిల్లీ)లో సుప్రసిద్ధ క్రికెటర్ గోల్ఫ్ క్రీడాకారుడు, పీజీటీఐ అధ్యక్షుడు కపిల్ దేవ్ తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గోల్ఫ్ టూరిజం విస్తరణకు ఉన్న అవకాశాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా విశాఖపట్నం, అమరావతి ప్రాంతాలలో గోల్ఫ్ పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు గల సాధ్యాసాధ్యాలను మంత్రి దుర్గేష్ .. కపిల్ దేవ్‌కు వివరించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించాల్సిందిగా కపిల్ దేవ్‌ను మంత్రి దుర్గేష్ అధికారికంగా ఆహ్వానించారు.

# సామాన్యుల శాపాలతో హైడ్రాకు రెండేళ్లు..!






**ప్రజా ఆస్తికి కవచమా..?**
**సామాన్యుడి కలలకు బుల్డోజరా..?**
**రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ ఆస్తి రక్షణ అని సర్కార్ లెక్కలు**
**3,311 ఎకరాల స్వాధీనం...**
**1,378 ఆక్రమణల తొలగింపు**
**చెరువులు బతికాయంటున్న అధికారులు... బతుకులు కూలిపోయాయంటున్న బాధితులు**
**అక్రమాలపై ఉక్కుపాదం సరే... బాధ్యులపై చర్యలు ఎక్కడ?**
**పునరావాసం, పారదర్శకత, సమాన న్యాయం కోరుతున్న నగరవాసులు**

**హైదరాబాద్(జై భీమ్ డెస్క్)**

హైదరాబాద్ నగరంలో చెరువులు, ప్రభుత్వ భూములు, నాలాలు, పార్కుల ఆక్రమణలను అరికట్టాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) నేటితో రెండేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ రెండేళ్లలో వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను రక్షించామని ప్రభుత్వం చెబుతుండగా, మరోవైపు కూల్చివేతలతో జీవితకాల పొదుపును కోల్పోయామని వందలాది కుటుంబాలు వాపోతున్నాయి. దీంతో హైడ్రా రెండేళ్ల ప్రయాణం విజయాలు, వివాదాలు, విమర్శల మధ్య చర్చనీయాంశంగా మారింది.

### లక్షన్నర కోట్ల ప్రజా ఆస్తి రక్షణ... అధికారిక గణాంకాలివే

హైడ్రా విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2026 జూన్ చివరి నాటికి మొత్తం 1,378 ఆక్రమణలను తొలగించి 3,311 ఎకరాల 11 గుంటల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. ఇందులో ప్రభుత్వ భూములు, చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లు, పార్కులు, ఓపెన్ స్పేస్‌లు, నాలాలు, రోడ్ల ఆక్రమణలు ఉన్నాయి. ఈ భూముల విలువ సుమారు రూ. 1.50 లక్షల కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దుర్గం చెరువు, అమీన్‌పూర్, సున్నం చెరువు, శంషాబాద్, రాయదుర్గం, గండిపేట, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లో చేపట్టిన చర్యలతో ఆక్రమణలకు అడ్డుకట్ట పడిందని అధికారులు చెబుతున్నారు. వర్షాకాలంలో వరదల ప్రభావం తగ్గేందుకు కూడా ఈ చర్యలు ఉపయోగపడతాయని ప్రభుత్వం పేర్కొంటోంది.

### హైడ్రా రాకతో మారిన పరిస్థితులు

హైడ్రా ఏర్పాటుకు ముందు చెరువుల ఆక్రమణలు, ప్రభుత్వ భూముల కబ్జాలు, నాలాలపై నిర్మాణాలు పెద్ద సమస్యగా ఉండేవి. కోర్టు ఉత్తర్వులు ఉన్నా అమలు జరగని పరిస్థితులు కనిపించేవి. హైడ్రా ఏర్పాటు తర్వాత అక్రమ నిర్మాణాలపై వేగంగా చర్యలు ప్రారంభమయ్యాయి. చెరువుల పరిధిలో భారీ కాంక్రీట్ నిర్మాణాలు నేలమట్టమయ్యాయి. ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి తిరిగి ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

### అయితే... మరోవైపు కనిపిస్తున్న బాధాకర దృశ్యాలు

హైడ్రా చర్యలకు ప్రశంసలు వచ్చినంతగానే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా బిల్డర్లు చూపించిన ప్రభుత్వ అనుమతులను నమ్మి జీవితాంతం కూడబెట్టిన డబ్బుతో ఇళ్లు కొనుగోలు చేసిన మధ్యతరగతి, పేద కుటుంబాలు ఒక్కసారిగా కూల్చివేతలతో రోడ్డున పడిపోయాయి. "మేం చట్టాన్ని ఉల్లంఘించలేదు... ప్రభుత్వ అనుమతులు ఉన్నాయనే నమ్మకంతోనే ఇళ్లు కొన్నాం" అని బాధితులు వాపోతున్నారు. సున్నం చెరువు, అమీన్‌పూర్, ఇతర ప్రాంతాల్లో కూల్చివేతలకు గురైన కుటుంబాలు ఇప్పటికీ పునరావాసం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

### తప్పు బిల్డర్లది... శిక్ష కొనుగోలుదారుదా?

హైడ్రా చర్యలపై వినిపిస్తున్న ప్రధాన విమర్శ ఇదే. అక్రమ వెంచర్లు వేసి కోట్ల రూపాయలు సంపాదించిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అనుమతులు ఇచ్చిన అధికారులు పెద్దగా నష్టపోకుండా బయటపడుతున్నారని, కానీ వారిని నమ్మి ఇళ్లు కొనుగోలు చేసిన సామాన్యులే నష్టపోతున్నారని విమర్శలు ఉన్నాయి. అక్రమ అనుమతులు ఎలా వచ్చాయి? వాటికి బాధ్యులెవరు? ఎంతమంది అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు? ఎంతమంది బిల్డర్ల ఆస్తులను జప్తు చేశారు? అనే ప్రశ్నలకు సమగ్ర సమాధానాలు రావాల్సి ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### రాజకీయ వివక్ష ఆరోపణలు

హైడ్రా చర్యలపై రాజకీయ విమర్శలు కూడా వస్తున్నాయి. ప్రభావశీలులు, పెద్ద సంస్థలు, రాజకీయ నాయకులకు సంబంధించిన ఆక్రమణల విషయంలో అదే వేగం కనిపించడం లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. చట్టం అందరికీ సమానంగా అమలైతేనే హైడ్రాపై ప్రజల్లో పూర్తి విశ్వాసం ఏర్పడుతుందని పౌరసంఘాలు సూచిస్తున్నాయి.

### పునరావాసమే అసలు పరీక్ష

అక్రమ నిర్మాణాల తొలగింపు అవసరమే అయినా, వాటి వల్ల నిరాశ్రయులైన కుటుంబాల పరిస్థితిని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని సామాజిక వర్గాలు కోరుతున్నాయి. అర్హులైన బాధితులకు ప్రత్యామ్నాయ నివాసం, నష్టపరిహారం, బాధ్యులపై చట్టపరమైన చర్యలు వంటి అంశాల్లో స్పష్టమైన విధానం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

### ప్రజల అంచనాలు ఇవే...

హైడ్రా నిజంగా ప్రజల విశ్వాసాన్ని పొందాలంటే కేవలం బుల్డోజర్లతో సరిపోదని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు. అక్రమ వెంచర్లు వేసిన బిల్డర్లపై కఠిన చర్యలు, అక్రమ అనుమతులు ఇచ్చిన అధికారులపై బాధ్యత నిర్ధారణ, స్వాధీనం చేసుకున్న భూముల వినియోగంపై శ్వేతపత్రం, బాధితులకు న్యాయం, రాజకీయాలకు అతీతంగా సమాన చర్యలు తీసుకుంటేనే హైడ్రా లక్ష్యం పూర్తిగా నెరవేరుతుందని చెబుతున్నారు.

### ముగింపు

రెండేళ్లలో హైడ్రా హైదరాబాద్ నగరంలో ఆక్రమణలపై భయాన్ని సృష్టించింది. చెరువులు, ప్రభుత్వ భూముల పరిరక్షణలో తన ముద్ర వేసింది. అదే సమయంలో కూల్చివేతలతో నష్టపోయిన కుటుంబాల కన్నీళ్లు కూడా ఈ రెండేళ్ల ప్రయాణంలో భాగమయ్యాయి. చెరువులను కాపాడటం ఎంత ముఖ్యమో... చట్టాన్ని నమ్మిన సామాన్యుడికి న్యాయం చేయడం కూడా అంతే ముఖ్యమనే అభిప్రాయం నగరంలో బలంగా వినిపిస్తోంది.

## ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన

# రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ హరి చందన దాసరి

**ప్రతి అర్హుడైన ఓటరును జాబితాలో చేర్చేలా బీఎల్‌వోలు బాధ్యతాయుతంగా పనిచేయాలి**

**హన్మకొండ,18 జులై 2026**




ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)- 2026 కార్యక్రమం ప్రక్రియను క్షేత్రస్థాయిలో రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, శక్తి (శక్తి) శాఖ కార్యదర్శి హరి చందన దాసరి, శనివారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తో కలిసి పరిశీలించారు. హనుమకొండ పట్టణంలోని బాలసముద్రం శ్రీనివాస్ కాలనీ, హంటర్ రోడ్డులోని దీన్ దయాళ్ నగర్ ప్రాంతాల్లో పర్యటించిన రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, బూత్ స్థాయి అధికారుల (బీఎల్‌వోలు) నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. హెల్ప్‌డెస్క్‌ల వద్ద ప్రజలకు అందిస్తున్న సేవలు, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, నమోదు ప్రక్రియ, డిజిటలైజేషన్ పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలతో నేరుగా మాట్లాడిన హరి చందన దాసరి, ఇంటింటి సర్వే నిర్వహణ విధానం, గైర్హాజరు, శాశ్వతంగా నివాసం మార్చుకున్న (షిఫ్టెడ్), మరణించిన (డెత్), తొలగింపునకు ప్రతిపాదించిన (డిలేషన్) ఓటర్ల వివరాలను పరిశీలించి, వాటి నిర్ధారణకు అనుసరిస్తున్న విధానంపై ఆరా తీశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారం అందించాలని, ప్రజలకు అవసరమైన వివరాలు తెలియజేస్తూ ఫారాలు సక్రమంగా నింపేలా సహకరించాలని బీఎల్‌వోలకు సూచించారు. సేకరించిన ఫారాలను ఆలస్యం చేయకుండా వెంటనే డిజిటలైజేషన్ చేసి, ఎన్నికల సంఘం నిర్దేశించిన కాలపట్టిక ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల వివరాల నమోదు, మార్పులు, తొలగింపుల విషయంలో పూర్తి పారదర్శకత పాటించాలని, ప్రతి నమోదును క్షేత్రస్థాయిలో ధ్రువీకరించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హెల్ప్‌డెస్క్‌ల ద్వారా అవసరమైన సహాయం అందించాలని, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎన్నికల పర్యవేక్షకులు జగత్ సింగ్, బూత్ స్థాయి అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గుండెల్లో శేఖర్ రావుది చెరగని ముద్ర

**అనునిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజలతో మమేకం**
**శత్రువును మిత్రుడి గా చూసుకునే దయగల గుణం శేఖర్ రావుది**
**35ఏండ్ల రాజకీయంలో మచ్చలేని నాయకుడు**
**శేఖర్ రావు మైకు పట్టుకుంటే ప్రతిపక్షాల పని బేజారు**
**వరంగల్ లో మంచి మనసున్న నేతల్లో శేఖర్ రావుదే మొదటి స్థానం**
**కష్టాల్లో ప్రతిపక్ష నాయకుడున్న సరే అదుకోవడం అతడికి వెన్నతో పెట్టిన విద్య**
**శేఖర్ రావుది అవకాశవాద రాజకీయం కాదు...సేవా రాజకీయం..?**

**వరంగల్ : (జై భీమ్ న్యూస్)**

అతను పేరు మోసిన సీనియర్ లాయర్ వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్ రావు నిజాయితీ నిబద్ధత కలిగిన సేవకు నిరాడంబరమైన నిస్వార్థ సేవలనుంచి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారు.కార్యకర్తలే తన బలంగా కొనసాగుతున్న శేఖర్ రావుకి రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు ఉంది.సుమారు 35 సంవత్సరాలు రాజకీయాల్లో మచ్చలేని నాయకుడిగా ఏదిగారు.అప్పటినుండి ఇప్పటివరకు ప్రజాసేవే తన లక్ష్యంగా అనునిత్యం ప్రజల్లో ఉంటూ ఆపదలో ఉన్నవారిని అక్కున చేర్చుకుని అదుకుంటూ శేఖర్ రావు అంటే దయ చూపే నేతగా రాజకీయాల్లో పేరు తెచ్చుకున్నాడు.నాటి నుండి నేటి వరకు ప్రజలతో మమేకమై ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటూ శేఖర్ రావు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నాడు. కష్టల్లో ప్రతిపక్ష పార్టీకి చెందిన వ్యక్తి ఉన్న సరే తన కష్టంగా బావించి సేవ చేసే గుణం శేఖర్ రావుకు వెన్నతో పెట్టిన విద్య లాంటింది..నియోజకవర్గంలో ప్రజలను తన సొంత కుటుంబంగా చూసుకుంటూ వారి కష్టసుఖాల్లో పాల్గొంటూ నియోజకవర్గ ప్రజల గుండెల్లో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు.కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకోవడంలో శేఖర్ రావు తర్వాతే ఏ నాయకుడైన అనడంలో అతిశయోక్తి లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజాక్షేత్రంలో నికర్షణ రాజకీయ నేదగా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో ప్రజాసేవకే తన జీవితాన్ని త్యాగం చేశారని సామాన్య ప్రజల సామాజిక ఆర్థిక రక్షణ కోసం కంకణ బద్ధులై ప్రజాసేవ కొనసాగిస్తున్నారు.వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా నియమితులైయ్యారు.ఆయన రాజకీయ వ్యూహాలు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు.ఇలా చెప్పుకుంటూపోతే శేఖర్ రావు విజయానికి అనేక ఉదాహరణలు చెప్పవచ్చు...



## పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఏపీ అత్యంత సురక్షితం

**పర్యాటక మంత్రి కందుల దుర్గేష్**
**“ఆల్ ఇండియా చాప్టర్ ఛైర్మన్ల సమావేశం 2026”కు ముఖ్య అతిథిగా మంత్రి**
**సింగిల్ విండో విధానం ద్వారా శరవేగంగా పర్యాటక అనుమతులు**




**అమరావతి, జులై 18 (జై భీమ్ న్యూస్):**

భారతదేశ దేశీయ పర్యాటక రంగ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అత్యంత కీలకమైన భూమిక పోషిస్తోందని, పర్యాటక రంగాన్ని ఒక వ్యూహాత్మక ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శనివారం న్యూఢిల్లీలోని చాణక్యపురి ‘హోటల్ జింజర్’ వేదికగా అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన “ఆల్ ఇండియా చాప్టర్ ఛైర్మన్ల సమావేశం 2026”కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. “స్వదేశీ పర్యటన్ ? సశక్త్ భారత్” అనే ప్రధాన ఇతివృత్తంతో.. ఆంధ్రప్రదేశ్ మరియు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలపై ప్రత్యేక ఫోకస్‌తో జరిగిన సదస్సు లో మంత్రి దుర్గేష్ కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, పర్యాటకరంగ సేవల్లో 30 ఏళ్లు పూర్తి చేసుకున్న ఎడిటిఓఐ సంస్థకు అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా 2,400 మందికి పైగా సభ్యులతో విస్తరించిన ఈ జాతీయ నెట్‌వర్క్, భారతీయ పర్యాటక రంగాన్ని ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దూరదృష్టితో కూడిన నాయకత్వంలో, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించామని, పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. విశాఖపట్నం, అరకు లోయ, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతిలను ఏడు ప్రధాన పర్యాటక హబ్‌లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆధ్యాత్మికం, తీరప్రాంతం (కోస్టల్), పర్యావరణం (ఎకో), బౌద్ధ వారసత్వం, గ్రామీణ సంస్కృతి కలగలిసిన అరుదైన పర్యాటక అనుభూతి ఆంధ్రప్రదేశ్ సొంతమని పేర్కొన్నారు. తిరుపతి, శ్రీశైలం వంటి దివ్యక్షేత్రాల నుండి అరకు లోయ అందాలు, గండికోట గ్రాండ్ కాన్యన్, బెలుం గుహల వరకు ఎన్నో అద్భుతాలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. పర్యాటక రంగం కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా గ్రామాలు, తీరప్రాంతాలు, గిరిజన ప్రాంతాల వరకు విస్తరించి మహిళలకు, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని, స్థానిక వంటకాలు మరియు చేతివృత్తులకు ప్రాచుర్యం తెస్తుందని మంత్రి దుర్గేష్ నొక్కి చెప్పారు. అమరావతి, నాగార్జునకొండ, తొట్లకొండ, బొజ్జన్నకొండ వంటి బౌద్ధ వారసత్వ ప్రదేశాలతో పాటు విజయవాడ, శ్రీకాళహస్తి క్షేత్రాలను, కోనసీమ గ్రామీణ పర్యాటకాన్ని, మారేడుమిల్లి, కోరింగ వంటి పర్యావరణ పర్యాటక కేంద్రాల ప్రాధాన్యతను మంత్రి వివరించారు.ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కలంకారీ కళలు, కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, ఉప్పాడ-ధర్మవరం చేనేత వస్త్రాలు మరియు అరకు కాఫీ వంటి విశిష్ట ఉత్పత్తులను టూరిజం ప్యాకేజీలలో భాగం చేయాలని కోరారు. పర్యాటకులు ఏపీని కేవలం చూడటమే కాదు... ఇక్కడి సంస్కృతిని అనుభవించేలా చేయాలన్నారు.పర్యాటకులు ఎక్కువ రోజులు బస చేసేలా, ఎక్కువ ఖర్చు పెట్టేలా సరికొత్త హోమ్‌స్టేలు, ఎకో-లాడ్జ్‌లు, కారవాన్ టూరిజం మరియు అడ్వెంచర్ టూరిజం వంటి మౌలిక వసతులను వేగంగా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఎడిటిఓఐ జాతీయ అధ్యక్షుడు వేద్ ఖన్నా, సంస్థ ముఖ్య ప్రతినిధులు, దేశంలోని వివిధ రాష్ట్రాల చాప్టర్ల ఛైర్మన్లు, పర్యాటక, హోటల్ రంగ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గోదావరి నదిలో వేటకెళ్లి ఐదుగురు మృతిపై సీఎం చంద్రబాబు విచారం

**అమరావతి, జూలై 18 (జై భీమ్ న్యూస్):**

పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో ఐదుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు గల్లంతయ్యారన్న విషయంపై ముఖ్యమంత్రి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గొమ్ముకొత్తగూడెంనకు చెందిన తుర్రం భారతి, ఊకే సుశీల, ఊకే లక్ష్మి, బాసిబోయిన బాలరాజు, ఊకే రమేష్ అనే ఐదుగురు వేటకు వెళ్లి మృత్యువాత పడినట్లు అధికారులు సీఎంకు వివరించారు. మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఐదుగురు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోలవరం జిల్లా కలెక్టర్ తో మాట్లాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులకి దిశానిర్దేశం చేశారు.

## ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద తీవ్ర విషాదం

**చేపలవేటకు వెళ్లిన ఐదుగురు మృతి**

**పోలవరం,జూలై18(జై భీమ్ న్యూస్):**

ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గోదావరిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతిచెందిన వారిని ఊకె సుశీల(37), ఊకె లక్ష్మి(37), తుర్రం భారతి(40), భాసుబోయిన బాలరాజు (38), ఊకె రమేశ్ (38)గా పోలీసులు గుర్తించారు. వారంతా గొమ్ము కొత్తగూడెం గ్రామ వాసులుగా వెల్లడించారు. బాధితులంతా చేపలు పట్టేందుకు గోదావరి నదిలోకి వెళ్లారు. అయితే, ప్రమాదవశాత్తూ వారంతా గల్లంతయ్యారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. స్థానికుల సహాయంతో గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి వారిని విగతజీవులుగా బయటకు తీశారు. ఈ ఘటనతో గొమ్ము కొత్తగూడెంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాల సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## ఐదుగురు మృతి ఘటనపై దిగ్భ్రాంతి

**డిప్యూటి సిఎం పవన్, హోంమంత్రి అనిత సంతాపం**

**అమరావతి,జూలై18(జై భీమ్ న్యూస్):**

పోలవరం జిల్లా ఏటపాక మండల పరిధిలోని గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు మృతి చెందిన ఘటన దిగ్భ్రాంతి కలిగించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పోలవరం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నట్లు చెప్పారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులకు దిశానిర్దేశర చేశామని పవన్ కల్యాణ్ వెల్లడించారు. గోదావరి నదిలో ఐదుగురు మృతి చెందిన ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మృతిచెందిన ఐదుగురి కుటుంబాలకు హోంమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు తక్షణ సహాయ చర్యలు అందేలా చూడాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని హోంమంత్రి వంగలపూడి అనిత ఆకాంక్షించారు.

## కిట్స్ వరంగల్‌లో రెండు కొత్త బీటెక్ కోర్సులకు అనుమతి

**సైబర్ సెక్యూరిటీ, వీఎల్ఎస్ఐ డిజైన్ అండ్ టెక్నాలజీ కోర్సుల ప్రారంభం**



**వరంగల్, 18 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్ వరంగల్)లో 2026--27 విద్యా సంవత్సరం నుంచి రెండు కొత్త బీటెక్ ప్రోగ్రామ్‌లను ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్ రెడ్డి తెలిపారు. బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సైబర్ సెక్యూరిటీ), బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (వీఎల్ఎస్ఐ డిజైన్ అండ్ టెక్నాలజీ) కోర్సులతో పాటు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (డేటా సైన్స్)లో అదనపు సెక్షన్‌కు అనుమతి లభించినట్లు పేర్కొన్నారు. ఈ కొత్త కోర్సులకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ), తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపాయని ఆయన వివరించారు. కిట్స్ వరంగల్ అదనపు కార్యదర్శి, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సైబర్ సెక్యూరిటీ, వీఎల్ఎస్ఐ, డేటా సైన్స్ రంగాలకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ కోర్సులు విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించడంతో పాటు మెరుగైన ఉపాధి, కెరీర్ అవకాశాలను కల్పిస్తాయని తెలిపారు. కొత్త కోర్సులకు అనుమతి లభించిన సందర్భంగా కిట్స్ వరంగల్ చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు, కోశాధికారి పి. నారాయణరెడ్డి అధ్యాపక బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, డీన్లు, విభాగాధిపతులు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. ప్రభాకరాచారి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

**ఈఎస్ఐ ఆసుపత్రిని పరిశీలించిన ప్రభుత్వ కార్యదర్శి హరి చందన దాసరి**



**హన్మకొండ, 18 జులై 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ లేబర్ కాలనీలోని ఈఎస్ఐ ప్రభుత్వ ఆసుపత్రిని తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీల శాఖ కార్యదర్శి, రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ హరి చందన దాసరి శనివారం సందర్శించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలోని వివిధ వార్డులను సందర్శించి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది స్పందనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యాధికారులతో సమావేశమై మౌలిక వసతులు, వైద్యులు, సిబ్బంది లభ్యత, మందుల నిల్వలపై సమీక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని, పరిశుభ్రతతో పాటు వైద్య సేవల నాణ్యతపై నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కాంతి సాగర్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ హేమలత, వైద్యులు, సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## హిట్ అండ్ రన్ కేసులో ఇద్దరు పోలీసులపై వేటు

**శ్రీకాకుళం,జూలై18(జై భీమ్ న్యూస్):**

వైసీపీ నేత, మాజీమంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు హిట్ అండ్ రన్ కేసులో కాశీబుగ్గ పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. విధుల్లో అలసత్వం, నిందితులకు సహకరించారన్న ఆరోపణలతో ఇద్దరు పోలీసులపై వేటు పడింది. కాశీబుగ్గ సీఐ రామకృష్ణను ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపించారు. ఇప్పటికే ఎస్ఐ సునీల్‌ను వీఆర్‌కు పంపిస్తూ ఉత్తర్వులు జారీ అయిన విషయం తెలిసిందే. మొదటి నుంచి కాశీబుగ్గ పోలీసుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు ప్రమాద కేసులో సాక్ష్యులను తారుమారు చేయటంలో కాశీబుగ్గ పోలీసుల పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# ఓటరు జాబితా సవరణను పారదర్శకంగా పూర్తి చేయాలి

## ఐదు జిల్లాల ఎస్ఐఆర్--2026 పురోగతిపై ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ హరి చందన దాసరి సమీక్ష






**హన్మకొండ, 18 జులై 2026(జై భీమ్ న్యూస్)**

ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)--2026 ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ హరి చందన దాసరి అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతిపై జిల్లా వారీగా సమీక్ష నిర్వహించారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, ఇంటింటి సర్వే, మ్యాపింగ్, డిజిటలైజేషన్, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలను సమీక్షించారు. ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని హరి చందన సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు బీఎల్‌వోల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ఒక్క అర్హుడైన ఓటరు కూడా నమోదు కాకుండా మిగిలిపోకుండా చూడాలన్నారు. హనుమకొండ జిల్లాలో 5.09 లక్షల మంది ఓటర్లు, 483 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. 100 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తికాగా, 68.13 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు. వరంగల్ జిల్లాలో 71 శాతం, మహబూబాబాద్ జిల్లాలో 74 శాతం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 71.74 శాతం, ములుగు జిల్లాలో 75.60 శాతం ఫారాల డిజిటలైజేషన్ పూర్తయినట్లు ఆయా జిల్లాల అధికారులు వెల్లడించారు. సమావేశంలో హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ కలెక్టర్ డా. సత్య శారద, జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, మహబూబాబాద్ కలెక్టర్ స్నేహ శబరిష్, ములుగు అదనపు కలెక్టర్ మహేందర్ జి, అదనపు కలెక్టర్లు రవి, సంధ్యారాణి, ఎన్నికల అధికారులు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఫార్మసీ కళాశాలలో ఘనంగా ఫేర్వెల్ వేడుకలు

## ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు



**హన్మకొండ, 18 జులై 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో చివరి సంవత్సరం విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు (ఫేర్వెల్) వేడుకలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జానపరెడ్డి కృష్ణవేణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగ రంగాల్లో విజయాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకుంటూ సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని సూచించారు. ఆచార్య గాదె సమ్మయ్య మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో క్రమశిక్షణ, కృషి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఉన్నత విద్యను పూర్తి చేసేందుకు ఎన్నో కష్టాలు పడి చదివించిన తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావడంతో పాటు వారికి తగిన గౌరవం ఇవ్వాలని కోరారు. భవిష్యత్తులో నిబద్ధతతో పరిశోధనలు చేపట్టి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పాటలు, నృత్యాలు, నాటికలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. సీనియర్ విద్యార్థులు కళాశాలలో గడిపిన మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. చివరగా అధ్యాపక బృందం విద్యార్థులకు గోల్డెన్ జూబ్లీ జ్ఞాపికలను అందజేసి ఉజ్వల భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపింది. ఆనందోత్సాహాల మధ్య జరిగిన ఈ వీడ్కోలు వేడుక విద్యార్థులకు చిరస్మరణీయంగా నిలిచింది. కార్యక్రమంలో సీనియర్ ఆచార్యులు వై. నరసింహారెడ్డి, డీన్ ఆఫ్ ఫ్యాకల్టీ నిరటి ప్రసాద్, ఆచార్యులు వి. స్వరూపరాణి, నాగరాజు, సహ ఆచార్యులు డా. షాహిదా, డా. ప్రియాంక, డా. సునీత, డా. సూర్యనారాయణ, డా. భాగ్య, డా. ఉష, డా. సంగీత్, శశిధర్, డా. సుకన్యతో పాటు పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యాలయాల్లో వికృత చేష్టలు వద్దు..

## ర్యాగింగ్ రహిత సమాజం దిశగా అడుగులు వేద్దాం

## ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు: జూనియర్ సివిల్ జడ్జి కె. పూజ




**వరంగల్, 18 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

విద్యాసంస్థల్లో ర్యాగింగ్ వంటి వికృత చేష్టలకు దూరంగా ఉంటూ, ర్యాగింగ్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె. పూజ పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భట్టుపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ నివాస మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం 'ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్--1997'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి కె. పూజ మాట్లాడుతూ ర్యాగింగ్ విద్యార్థుల జీవితాలను చిన్నాభిన్నం చేసే సామాజిక సమస్యగా మారిందన్నారు. వినోదం పేరుతో ప్రారంభమయ్యే ర్యాగింగ్ మానసిక, శారీరక వేధింపులకు దారితీస్తుందని తెలిపారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లను భయభ్రాంతులకు గురిచేయడం, అవమానించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ర్యాగింగ్‌కు పాల్పడినట్లు రుజువైతే విద్యాసంస్థ నుంచి బహిష్కరణతో పాటు చట్టప్రకారం జైలు శిక్ష, జరిమానా వంటి చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ర్యాగింగ్ నియంత్రణకు ప్రతి కళాశాలలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి, విద్యార్థుల్లో నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. ర్యాగింగ్ రహిత విద్యాసంస్థల నిర్మాణానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఆర్. సురేష్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఆర్. రజిని, కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. రాధిక, అధ్యాపకులు, సిబ్బంది, సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆగస్టు 6న కేయూలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఫోటో ఎగ్జిబిషన్

## తెలంగాణ ఉద్యమ ప్రస్థానాన్ని ప్రతిబింబించే 400 అరుదైన చిత్రాల ప్రదర్శన



**వరంగల్, 18 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ 92వ జయంతిని పురస్కరించుకొని ఆగస్టు 6న కాకతీయ విశ్వవిద్యాలయం మహిళా ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో ఆయన ఉద్యమ ప్రస్థానానికి సంబంధించిన ప్రత్యేక ఫోటో గ్యాలరీ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ కన్వీనర్ డాక్టర్ కొణతం కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఫోటో ఎగ్జిబిషన్‌కు సంబంధించిన పోస్టర్‌ను కాకతీయ విశ్వవిద్యాలయం ఎస్‌డీఎల్‌సీఈలోని పూలే విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సారంగపాణి, ప్రొఫెసర్ విజయబాబు మాట్లాడుతూ జయశంకర్ సార్ విద్యార్థి దశ నుంచి తెలంగాణ సిద్ధాంతకర్తగా ఎదిగిన క్రమాన్ని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగించిన ఉద్యమ ప్రస్థానాన్ని ఫోటోల రూపంలో ప్రజలకు పరిచయం చేయనున్నట్లు తెలిపారు. 1952లో జరిగిన 'నాన్ ముల్కీ గో బ్యాక్' ఉద్యమం నుంచి 1969 తొలి దశ తెలంగాణ ఉద్యమం, 2001 నుంచి సాగిన మలిదశ తెలంగాణ ఉద్యమంలోని కీలక ఘట్టాలకు సంబంధించిన దాదాపు 400 అరుదైన ఫోటోలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. డాక్టర్ శేషు, డాక్టర్ వీరస్వామి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ గడ్డం కృష్ణయ్య మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ చరిత్రలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ పోషించిన పాత్ర అజరామరమని కొనియాడారు. ఆయన పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయడంలో ఈ ఫోటో ఎగ్జిబిషన్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆగస్టు 6న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో ఎగ్జిబిషన్ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులు, జయశంకర్ సార్ శిష్యులు, సహచరులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ కొణతం కృష్ణ విజ్ఞప్తి చేశారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డాక్టర్ రాజ్ మహమ్మద్, డాక్టర్ ఎర్రబొజ్జు రమేష్, డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్, డాక్టర్ బ్రహ్మయ్య, ప్రతిభ, అశోక్ కుమార్, గంగుల దయాకర్, జనగామ కుమారస్వామి, ధారబోయిన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రను తెలుసుకోవడం.. వారసత్వ సంపదను పరిరక్షించడం అందరి బాధ్యత

## వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**హైద్రాబాద్, 18 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

పూర్వీకులు అందించిన అమూల్యమైన చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను పరిరక్షించి భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ మహాలక్ష్మి కోర్ట్‌యార్డ్‌లో ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'హెరిటేజ్ ఏ ఎవ్రీ స్టెప్ 2.0' ప్రదర్శనకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని చారిత్రక గ్రామాలు, పురాతన దేవాలయాలు, శాసనాలు, కట్టడాలు, పురావస్తు ప్రదేశాలకు సంబంధించిన అరుదైన చారిత్రక విశేషాలను ఎంపీ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చరిత్రను తెలుసుకోవాలని, చరిత్ర అధ్యయనం ద్వారా మన మూలాలు, సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా యువతలో చరిత్రపై ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. 'ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టెరిటీ (పీహెచ్‌పీ)' కార్యక్రమం ద్వారా మరుగున పడిన అనేక చారిత్రక, పురావస్తు విశేషాలను వెలుగులోకి తీసుకువస్తున్న ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈ. శివనాగిరెడ్డి కృషిని ఎంపీ కడియం కావ్య ప్రత్యేకంగా అభినందించారు. పురాతన సంపదను గుర్తించి, దాని చారిత్రక ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తూ వారసత్వ పరిరక్షణకు విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ ఈ. శివనాగిరెడ్డిని ఎంపీ కడియం కావ్య శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చరిత్రాభిమానులు, పరిశోధకులు, విద్యార్థులు, సాంస్కృతిక రంగ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆహార కల్తీపై కఠిన చట్టం

## ఆహార, ఔషధాల కల్తీ నివారణకు సమగ్ర చట్టం రూపొందించాలని సీఎం రేవంత్ ఆదేశం

## ప్రపంచ దేశాల విధానాలను అధ్యయనం చేసి బిల్లు సిద్ధం చేయాలని సూచన

## విజిల్‌బ్లోయర్ వ్యవస్థ, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయనున్న ప్రభుత్వం

## సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక వ్యవస్థపై దృష్టి

## క్యూర్ ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసి రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ

**హైదరాబాద్, జూలై 18 (జై భీమ్ న్యూస్ ):**

రాష్ట్రంలో ఆహార, ఔషధాల కల్తీని పూర్తిగా అరికట్టేందుకు కఠినమైన చట్టాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంసీహెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో తెలంగాణ ఆహార కల్తీ, ఔషధ నియంత్రణ చట్టంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పండ్లు, పాలు తదితర ఆహార పదార్థాల్లో పెరుగుతున్న కల్తీ కారణంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు, పండ్లు త్వరగా మగ్గేలా చేయడానికి విచ్చలవిడిగా రసాయనాలు వినియోగించడం ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిందన్నారు. ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగంతో పంట ఉత్పత్తుల్లో రసాయన అవశేషాలు పెరిగి కొన్ని దేశాలు దిగుమతులను తిరస్కరిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో అధిక ధరలకు విక్రయిస్తున్న వస్తువులు నిజంగా సేంద్రియమైనవేనా అనే విషయాన్ని నిర్ధారించే వ్యవస్థలు ప్రస్తుతం లేవని పేర్కొన్నారు. కల్తీల నియంత్రణలో సమర్థవంతమైన చట్టాలు అమలు చేస్తున్న దేశాలను సందర్శించి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా బిల్లును సిద్ధం చేసి శాసనసభలో సమగ్ర చర్చ నిర్వహించడంతో పాటు ప్రజల అభిప్రాయాలను కూడా స్వీకరించాలని సూచించారు. కల్తీలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించేందుకు విజిల్‌బ్లోయర్ వ్యవస్థతో పాటు ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించిన ముఖ్యమంత్రి, తొలి దశలో క్యూర్ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అక్కడ అమలు ఫలితాలను పరిశీలించిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్‌అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శులు వి. శేషాద్రి, ఎన్. శ్రీధర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది









**జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ**
**కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా**
**ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి**
**తెలంగాణలో లూటీ జరుగుతోంది**
**మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోంది**
**చాయ్ పే చర్చాను మరచిన రాహుల్**
**బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ ఘాటు విమర్శలు**

**హైదరాబాద్,జూలై18(జై భీమ్ న్యూస్):**


ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తప్పారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీకి తెలుగు రాదు.. మన బాధ తెల్వదు అని అన్నారు. అశోక్‌నగర్‌లో చాయ్‌పే చర్చా పెట్టింది అసలు రాహుల్‌గాంధీకి గుర్తుందా అని ప్రశ్నించారు. యువత తలరాత మారుస్తానని అబద్ధపు హామీలు ఇచ్చారని.. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయి? విద్యా భరోసా ఏమైందని అడిగారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని.. తెలంగాణలో లూటీ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోందని ఆరోపించారు. కొలువుల కుంభమేళా అని చెప్పి.. కుంభకోణాల కుంభమేళా చేస్తున్నారని మండిడ్డారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు అడిగితే ఉరికించి కొడుతున్నారని కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం కాదు.. ఉన్మాదపర్వం చూపిస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల పట్ల దౌర్జన్య కాండ కొనసాగుతోందని తెలిపారు. రాహుల్ గాంధీకి నిరుద్యోగుల ఆక్రోశం కనబడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగ అభ్యర్థుల శోకాలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో దాడులు, ఓయూలో నిర్బంధాలు కనిపించడం లేదా అని అడిగారు. ఢిల్లీలో రాజ్యాంగం చేత పట్టుకుని రాహుల్ గాంధీ సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డున ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే పట్టించుకునే వారే లేరని కేటీఆర్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు వదిలిపెట్టనని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని తెలిపారు. నవంబర్ 22న అవినీతి సొమ్ముతో జాబ్ క్యాలెండర్‌పై యాడ్‌లు వేశారని గుర్తుచేశారు. కానీ ఇవాళ జాబులు లేవు.. జవాబులు లేవని విమర్శించారు. ఉద్యోగాలు లేవు.. క్యాలెండర్ మారినా.. జాబ్ క్యాలెండర్‌కు దిక్కు లేదని అన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితాలుగా మారిందని విమర్శించారు. చరిత్రను మరిచిపోతే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. చరిత్రలు, ఇతిహాసాలు, పురాణాలు చదవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. తెలంగాణ ఉద్యమాల్లో చావగొట్టిన వాళ్లే మళ్లీ అధికారంలోకి వస్తారని తెలిపారు. కాంగ్రెస్ అలవిగాని హామీలు నమ్మి తెలంగాణ యువత మోసపోయింద్రు అని తెలిపారు. 1952, 1969లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువత గుండెల్లో గుణపాలు నింపిందని గుర్తుచేశారు. వేలమంది యువత ప్రాణాలు తీసుకున్నా కాంగ్రెస్‌కు రక్తదాహం తీరడం లేదని అన్నారు. మన రక్తం పొలాల మీద చల్లాలని చిల్లరమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు, యూత్, మహిళ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. ఓటు కోసం కోటి మోసాలు చేస్తున్న కాంగ్రెస్ తీరు దేశానికి తెలియాలన్నారు. రేపటి తెలంగాణ నిర్మాతలు మీరు.. భవిష్యత్ నిర్ణేతలు మీరే అని యువతను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అలాంటి యువతను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తున్నదని మండిపడ్డారు. మీకు జరిగిన మోసం, వంచనను గుర్తుచేసుకుని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సరిగ్గా 38 నెలల కింద ఇదే సరూర్ నగర్ స్టేడియం సాక్షిగా తెలంగాణ యువత దగా పడిందని తెలిపారు. నిరుద్యోగులను వంచించిన దగాకోరులు కాంగ్రెస్ నాయకులు అని పేర్కొన్నారు. హైకమాండ్ తరలివచ్చి మాయామశ్చీంద్ర కార్యక్రమం ఇక్కడ చేశారని ఎద్దేవా చేశారు. యూత్ డిక్లరేషన్ పేరిట దుర్మార్గమైన వాగ్దానాల వరద పాటించారని మండిపడ్డారు. పాత కేటుగాళ్లు.. కొత్త డూప్లికేట్లు వచ్చి యువతపై లేని ప్రేమను కనబరిచారని తెలిపారు. యూత్‌కు ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చారా అని నిలదీశారు. ప్రైవేటు కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్ వచ్చిందా అని అడిగారు. కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు వచ్చాయా? యువతకు రూ.10లక్షల రుణాలు వచ్చాయా? ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వచ్చాయా? అని ప్రశ్నించారు. నాలుగు ట్రిపుల్‌ఐటీలు, మూడు యూనివర్సిటీలు వచ్చాయా? నెలకు రూ.4వేల భృతి వచ్చిందా? పదో తరగతిలో రూ.10వేలు, ఇంటర్ పాసైతే రూ.15వేలు వచ్చాయా? డిగ్రీ ఉత్తీర్ణులతై లక్ష వచ్చాయా? పీహెచ్‌డీ పాసైతే రూ.5లక్షలు వచ్చాయా? అని ప్రశ్నించారు. ఇంత మోసానికి పాల్పడిన వారిని ఏమనాలో ఆలోచించాలని సూచించారు. దగుల్బాజీలా.. దోకేబాజ్‌లు అనాలో మీరే ఆలోచించాలన్నారు. జిత్తులమారి ముసలి నక్క కాంగ్రెస్ యువజనాన్ని తెలివిగా చిత్తు చేసిందని కేటీఆర్ విమర్శించారు. 60 ఏళ్లు నెత్తురు మరిగిన కాంగ్రెస్ యువతను ఎలా మోసం చేసిందో గుర్తించాలన్నారు. కాంగ్రెస్ మోసపు వలలో పడిపోయి గోసపడుతున్నారని తెలిపారు. 31 నెలలు గడిచాయి.. నిరుద్యోగులకు కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. మాటతప్పి వంచించి, నమ్మించి నట్టేట ముంచి అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. యువతరంతో పెట్టుకుంటే కొన్ని తరాలు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

# గాంధీ జయంతి నాటికి చెత్తకు మోక్షం

**చెత్తనుంచి సంపద సృష్టించడమే మా లక్ష్యం**
**తడి, పొడి చెత్తను ఇంట్లోనే వేరు చేయాలి**
**ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాల కోసం రూ.528 కోట్లు ఖర్చు**
**రౌడీయిజం చేసేవారిని ఉపేక్షించబోమని హెచ్చరిక**
**గుడివాడ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు**

**విజయవాడ,జూలై18(జై భీమ్ న్యూస్):**


రాష్ట్రంలో అక్టోబర్ 2 గాంధీ జయంతి నాటికి చెత్తలేకుండా చేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. చెత్త నుంచి సంపద సృష్టించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. గుడివాడలో జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుంటూరు, నెల్లూరు నగరాల్లో చెత్త సేకరణకు ఉపయోగించే.. ఎలక్ట్రిక్ ఆటోలను వర్చువల్‌గా ప్రారంభించారు. బాగా పని చేసిన వారికి పురస్కారాలను ప్రదానం చేశారు. ఇంట్లో ఎవరికి వారే.. తడి, పొడి చెత్తను వేరు చేసుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. మే 23 నుంచి జూన్ 20 వరకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం చేపట్టాం. ఆగస్టు 26 నాటికి 1140 ఈ-ఆటోలు అందుబాటులోకి వస్తాయి. 108 సమగ్ర ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాల కోసం రూ.528 కోట్లు ఖర్చు చేస్తున్నాం. 'ప్రజారథం' కార్యక్రమం ద్వారా చెత్తను కొనుగోలు చేసి.. నిత్యావసర వస్తువులు అందజేశాం. దీనికోసం ఇప్పటి వరకు రూ.16 కోట్లు ఖర్చు చేశాం. చెత్త నుంచి సంపద సృష్టించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని చంద్రబాబు అన్నారు. ఎవరి ఇంటిపై వాళ్లే కరెంటు తయారు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాలుష్యం మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. చెత్త నిర్వహణలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని సూచించారు. ఇంట్లోనే తడి, పొడి చెత్తలను వేరు చేసుకోవాలని తెలిపారు. తడి చెత్తను కంపోస్ట్‌గా తయారు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏపీలో అక్టోబర్ 2వ తేదీ నాటికి చెత్తలేకుండా చేస్తామని చెప్పారు. ఈ నెలలోనే తల్లికి వందనం కింద డబ్బులు వేస్తామని వెల్లడించారు. అంగన్ వాడీ కార్యకర్తలు, స్వచ్ఛాంధప్రదేశ్‌లో పనిచేసే కార్మికులకు తల్లికి వందనం అమలు చేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రౌడీయిజం చేస్తే ఎవరినీ వదిలిపెట్టనని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. అమృత్ 2.0 శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. స్వర్ణ పంచాయతీ ఉద్యోగులకు స్వచ్ఛ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. గొడ్డలి పార్టీతో పెద్ద సమస్య వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో కొందరు క్రిమినల్స్‌గా మారారని చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి కొడుకు యాక్సిడెంట్ చేస్తే ఓ వ్యక్తి చనిపోయాడని తెలిపారు. పోస్టర్లు, కటౌట్‌లకు పొట్టేళ్లను బలి ఇస్తున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ లక్ష్యం ప్రజలను దోపిడీ చేయడమేనని విమర్శించారు. తన జీవితంలో ఇలాంటి రాజకీయాలు చూడలేదని అన్నారు. ప్రజల జీవితాలతో ఆడుకుంటే తాము చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇదిలావుంటే రాష్ట్రాభివృద్ధిలో మేము సైతం అంటూ కొందరు ఉదారతను చాటారు. గుడివాడలో జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబుకు తమ వంతు విరాళాలను అందించారు. అమరావతి కోసం గుడివాడకు చెందిన సాయిశ్వేత బంగారు గాజులు అందించారు. ఆమె కుమారుడు దాచుకున్న కిడ్డీ బ్యాంక్ నగదును కూడా అమరావతి అభివృద్ధికి వినియోగించాలని కోరారు. మరోవైపు గుడివాడ ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి కోసం అన్నే నరసింహారావు, పుష్ప లీలావతి దంపతులు రూ.3 కోట్ల విరాళం ఇచ్చారు. గతంలోనూ వారు గుడివాడ ప్రభుత్వ ఆస్పత్రికి రూ.3 కోట్లు విరాళం ఇచ్చారు.



# స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలి

**16 నుండి 26 వరకు 'బోనాలు- చేతివృత్తుల మేళా'**
**ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శనలు**
**మంత్రి పొన్నం ప్రభాకర్**





**హైదరాబాద్,జూలై18(జై భీమ్ న్యూస్):**

చేతి వృత్తి కళాకారులకు చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వ బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 'బోనాలు- చేతివృత్తుల మేళా, బిసి చేతివృత్తుల అమ్మకాలు- ప్రదర్శన'ను ఈనెల 16వ తేదీ నుండి 26 వరకు ట్యాంక్ బండ్, అంబేద్కర్ విగ్రహము ప్రక్కన గల గ్రౌండ్స్ లో నిర్వహిస్తోంది.చేతివృత్తుల కళాకారులచే తయారు చేసిన వివిధ వస్తువుల ప్రదర్శన, విక్రయము విజయవంతంగా కొనసాగుతున్నది. ఈ ప్రదర్శనలో కుమ్మరులు వారు తయారు చేసిన మట్టిపాత్రలు, గౌడన్నల 'నీరా' స్టాల్, మేదరివారు తయారు చేసిన వెదురు వస్తువులు,హ్యాండ్ లూమ్స్ పోచంపల్లి-ఇక్కత్, గద్వాల్ - నారాయణపేట్, పూసలవారి సామగ్రి, మహిళా స్వయం సహాయక సంఘాల స్వగృహ ఫుడ్స్, ఇతర బిసి వర్గాలచే తయారు చేయబడిన వస్తువులు, తెలంగాణ వంటకాలు, మత్స్య కారుల తయారు చేయబడే చేప వంటకాలు, ఇతర భోజన స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శనలో లభించే వస్తువులు వినియోగదారులకు, సందర్శకులకు సరసమైన ధరలలో లభ్యమవుతున్నాయి. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 10:00 గంటల వరకు కొనసాగుతున్నది. ప్రభుత్వం సందర్శకులకు ప్రవేశము ఉచితంగా కల్పిస్తున్నది. ప్రదర్శనలో వివిధ రంగాలకు చెందిన 60 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి వస్తున్న విశేష ఆదరణతో స్టాల్స్ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చేనేత, హస్తకళలు, మట్టి కళలు, చెక్క బొమ్మలు వంటి సంప్రదాయ కళలను ప్రోత్సహించడమే ఈ మేళా ప్రధాన లక్ష్యమని, గ్రామీణ కళాకారుల ప్రతిభకు మార్కెట్ కల్పిస్తూ వారి జీవనోపాధిని బలోపేతం చేయడంలో ఇటువంటి మేళాలు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర బిసి సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'వోకల్ ఫర్ లోకల్' భావనకు అనుగుణంగా స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలని, సాంప్రదాయ కళలను నేటి తరానికి పరిచయం చేసి, భావితరాలకు అందించడం మన అందరి బాధ్యత అని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కళాకారుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, మార్కెటింగ్ అవకాశాల విస్తరణకు కట్టుబడి ఉందన్నారు. మేళాలో పాల్గొన్న ప్రతి కళాకారుడికి అభినందనలు తెలియజేస్తూ, ప్రజలు పెద్ద ఎత్తున సందర్శించి హస్తకళ ఉత్పత్తులను కొనుగోలు చేసి కళాకారులను ప్రోత్సహించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మన కళలు, మన చేతివృత్తులు? మన సంపద అనే భావనతో ప్రతి ఒక్కరూ ఈ మేళాను విజయవంతం చేయాలన్నారు. బోనాల పండుగకు అవసరమైన బోనం కుండలతో పాటు సంప్రదాయ ఆచారాలకు ఉపయోగించే వివిధ రకాల వస్తువులను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానంలో అంతర్భాగమైన అనేక కులవృత్తులు కనుమరుగు అవ్వకుండా మరింతగా ప్రోత్సహించెందుకు ప్రభుత్వం ప్రదర్శనను ఏర్పాటు చేసింది.

# అథ్లెట్ ప్రవల్లికకు సిఎం రేవంత్ అభినందనలు

**హైదరాబాద్,జూలై18(జై భీమ్ న్యూస్):**

చైనాలోని ఒర్డోస్‌లో జరిగిన తొలి ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026లో మహిళల 4-400 మీటర్ల రిలే పోటీలో స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఆధ్వర్యంలోని గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని నరిమళ్ల ప్రవల్లికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఉన్నతాధికారులతో కలిసి ప్రవల్లిక ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అభినందించిన సిఎం క్రీడలకు తెలంగాణ కేంద్రంగా మారాలని అభినందించారు. ప్రవల్లికకకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# పవన్ కళ్యాణ్‌కు లోకేశ్ పరామర్శ

## త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

**హైదరాబాద్,జూలై18(జై భీమ్ న్యూస్):**

కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. హైదరాబాద్ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పవన్‌ను కలిసిన ఆయన.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనలు పాటించి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఇటీవల ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ దిన్షా పార్థీవాలా నేతృత్వంలో వైద్యుల బృందం పవన్ కుడి భుజానికి సర్జరీ చేసింది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం





**స్కైరూట్ ఏరోస్పే 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతం**
**తొలుత ఇంధన ప్రక్రియలో సాంకేతిక లోపం అరగంటలోపే సరిదిద్ది**
**పూ÷-రయోగాన్ని పూర్తి చేసిన షార్**
**ప్రైవేట్ రంగంలో తొలి రాకెట్ కావడంతో సర్వత్రా హర్షం**
**ప్రయోగాన్ని వీక్షించిన లోకేశ్, ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు**

**శ్రీహరికోట,జులై18(జై భీమ్ న్యూస్):**

భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి చేపట్టిన ప్రయోగం విజయవంతం అయ్యింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పే 'విక్రమ్-1' రాకెట్ రూపొందించింది. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైంది. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతరిక్ష కార్యక్రమాలు సహా భారత ప్రైవేటు రంగం కూడా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపగల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటినట్లు అయ్యింది. వాస్తవానికి ఉదయం 11.30 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు పరిశీలనలు చేపట్టి ఇంధన పక్రియలో తలెత్తిన సమస్యను గుర్తించి సరిచేశారు. 35 నిమిషాల తర్వాత తిరిగి రాకెట్‌ను ప్రయోగించారు. ఈ రాకెట్.. సాంకేతిక పేలోడ్‌లు సహా ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసి పంపిన ప్రత్యేక పోస్ట్‌కార్డును అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్-1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్నీ నింగిలోకి పంపారు. దీనిపై సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి ప్రముఖుల సూక్ష్మరూపాలను చెక్కారు. అంతేకాకుండా.. ఈ ప్రయోగం విజయవంతం కావాలని కాంక్షిస్తూ స్కైరూట్ టీమ్ సహా ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు, ఇతరులు పంపిన డజన్ల కొద్దీ చేతిరాత పోస్ట్‌కార్డులనూ ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరిచారు. స్కైరూట్ సంస్థ 'మిషన్ ఆగమన్' పేరిట ఈ ప్రయోగం చేపట్టింది. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటాల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ మిషన్‌కు ఆ పేరు పెట్టింది. విక్రమ్-1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసెర్ఫ్, డీక్యూబ్‌డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ పేలోడ్‌లు సహా స్కైరూట్‌కు చెందిన 'స్కోప్'ను కూడా అంతరిక్షంలోకి పంపారు. ఈ ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్ష ప్రయాణంలో పరీక్షించి తద్వారా కీలక సమాచారం రాబట్టనున్నారు. దీంతో రానున్న కాలంలో వాణిజ్య ప్రయోగాల అవసరాలకు సాంకేతిక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడమే లక్ష్యంగా స్కైరూట్ ముందడుగేస్తోంది. ఇక.. సుమారు ఏడంతస్తుల భవనం ఎత్తులో రూపొందిన విక్రమ్-1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తులోని లోఎర్త్ ఆర్బిట్ లో ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2022లో విక్రమ్-ఎస్ ద్వారా తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి పంపిన స్కైరూట్.. ఇప్పుడు విక్రమ్-1తో తొలి దేశీయ ప్రైవేట్ ఆర్బిటాల్ ప్రయోగం చేపట్టింది. ఈ ప్రయోగాన్ని ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రత్యక్షంగా వీక్షించారు. కుమారుడు దేవాన్ష్‌తో కలిసి శ్రీహరికోటకు వెళ్లిన లోకేశ్.. ఇస్రో గ్యాలరీ నుంచి 'విక్రమ్-1' ప్రయోగాన్ని వీక్షించారు. ఇస్రో మాజీ ఛైర్మన్లు, సీనియర్ శాస్త్రవేత్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఓ మంచి ఆలోచనతో ముందడుగు వేద్దాం..

**మంచి అలవాట్లు సమాజంలో పెద్ద మార్పునకు పునాదులు**
**మన అందరి ఆరోగ్యం, ఆనందానికి సమష్టిగా కృషిచేద్దాం**
**ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉందాం**
**పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి**
**స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ,జూలై18(జై భీమ్ న్యూస్):**



స్వచ్ఛమైన ఆనందమయ ఆరోగ్య ఆంధ్ర నిర్మాణంతో స్వర్ణాంధ్ర సాకారానికి ఓ మంచి ఆలోచనతో ముందడుగు వేయాలని.. సమాజంలో మార్పు మన నుంచే మొదలుకావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. నెలలో మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎనికేపాడులోని ఎస్ఆర్‌కే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బల్క్ వేస్ట్ జనరేటర్ల థీమ్‌తో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటిన తర్వాత జిల్లా మహిళా, శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్యం, పంచాయతీరాజ్ శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక బాధ్యత మరచి పాలిథిన్ సంచిని వినియోగించి బయటపడేయడం వల్ల సమాజానికి ఎంత నష్టం కలుగుతుందో క్షుణ్నంగా వివరించారు. ప్రకృతి మనకు అమూల్యమైన వరమని, దాన్ని పరిరక్షించడం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. రోజువారీ జీవితంలో ఎ÷-లాస్టిక్ ముఖ్యంగా సింగిల్-యూజ్ ఎ÷-లాస్టిక్‌కు దూరంగా ఉండాలని.. గుడ్డ సంచులు, జూట్ బ్యాగులు, ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని సూచించారు. ఎ÷-లాస్టిక్ వ్యర్థాలు నేల, నీరు, గాలి కాలుష్యానికి ప్రధాన కారణమవుతున్నాయని, మానవ ఆరోగ్యంతో పాటు జీవ వైవిధ్యానికీ తీవ్ర ముప్పు కలిగిస్తున్నాయని తెలిపారు. ఇంటి నుంచే చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేయడం, పరిశుభ్రతను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల బహుళ ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2026 ప్రకారం చెత్తను మూలంలోనే నిర్వహించి, పర్యావరణాన్ని పరిరక్షిద్దాం నినాదంతో ముందుకెళ్తూ బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించడం, ప్రోత్సహించే విధానాలను వివరించారు. రోజుకు 100 కిలోలు లేదా అంతకంటే ఎక్కువ చెత్త ఉత్పత్తి చేయడం, 20 వేల చదరపు మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ విస్తీర్ణం కలిగి ఉండటం, రోజుకు 40 వేల లీటర్లు లేదా అంతకంటే ఎక్కువ నీటిని వినియోగించడం. ఈ మూడింటిలో ఏదో ఒకటి వర్తించినా ఆ సంస్థను బల్క్ వేస్ట్ జనరేటర్‌గా పరిగణించడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. కార్యక్రమంలో భాగంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞతో పాటు ఇంటి వద్ద వ్యర్థాల నిర్వహణలో చురుగ్గా వ్యవహరిస్తున్న మహిళలకు జ్యూట్ బ్యాగులు, ప్రశంసా పత్రాలు అందించారు. అదేవిధంగా గ్రీన్ అంబాసిడర్లను సగౌరవంగా సత్కరించారు. ళాశాల ప్రిన్సిపల్ డా. కె.రమేష్.. నిత్య జీవితంలో ఎదురయ్యే సవాళ్లు కొత్త అవకాశాలు, ఆవిష్కరణలు, సుస్థిర అభివృద్ధికి ఎలా దోహదం చేస్తాయో వివరించారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర కీలకమైందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీపీవో టి.సీతామహాలక్ష్మి, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి వెంకటలక్ష్మి, డీఎల్‌పీవో రాఘవన్, ఎంపీడీవో పార్థసారథి, తహశీల్దార్ లలిత, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చారిత్రక ఘట్టానికి ఈ ప్రయోగం నిదర్శనం

**ఇస్రోను అభినందించిన పవన్, లోకేశ్**

**అమరావతి,జులై18(జై భీమ్ న్యూస్):**

విక్రమ్-1 రాకెట్ ప్రయోగంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. ఈ ప్రయోగాన్ని చరిత్రాత్మక ఘట్టంగా పవన్ కల్యాణ్ అభివర్ణించారు. భారత అంతరిక్ష రంగంలో తొలిసారిగా ఓ ప్రైవేట్ ఏరోస్పేస్ రూపొందించిన రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. 'విక్రమ్-1' రాకెట్, 'మిషన్ ఆగమన్' పేరుతో శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రంలో ఈ ప్రయోగాన్ని చేపట్టారు. భారతదేశం ఈ రోజు అంతరిక్ష రంగంలో మరో కీలక మైలురాయిని చేరుకుందని పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించిన విక్రమ్-1 రాకెట్, అంతరిక్ష సాంకేతికత, ఆవిష్కరణల్లో ప్రపంచ అగ్రగామిగా నిలవాలనే భారతదేశ లక్ష్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ చరిత్రాత్మక ప్రయోగం ప్రధానమంత్రి నరేంద్రమోదీ దార్శనికతకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు. బారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా దేశంలో ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడ్డాయని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో ఇస్రో పోషించిన పాత్రను ప్రత్యేకంగా ప్రశంసించారు. శాస్త్రీయ పరిశోధన, సాంకేతిక నైపుణ్యం, యువతలోని వ్యవస్థాపక స్ఫూర్తిని ప్రోత్సహించడంలో ఇస్రో కీలకంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. విక్రమ్-1 మిషన్ భారతీయ ప్రతిభ, శాస్త్రీయ సామర్థ్యం, ఆవిష్కరణల శక్తికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ధైర్యం, పట్టుదల, వినూత్న ఆలోచనలతో ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చనే సందేశాన్ని ఈ ప్రయోగం ప్రతి యువ భారతీయుడికి అందిస్తుందని చెప్పుకొచ్చారు. చరిత్రాత్మక విజయాన్ని సాధించేందుకు కృషి చేసిన స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్-స్పేస్ సంస్థల బృందాలకు పవన్ కల్యాణ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విక్రమ్-1 మిషన్ విజయవంతంగా పూర్ఖై భారత అంతరిక్ష రంగానికి మరిన్ని విజయాలకు నాంది పలకాలని ఆకాంక్షించారు. భారతదేశాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే ఈ విజయగాథ రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలిచి, మరింత పెద్ద కలలు కనేందుకు యువతను ప్రేరేపించాలని పవన్ కల్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. విక్రమ్-1 రాకెట్ ప్రయోగం విజయవంతమైందని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. 350 కేజీల బరువున్న ఉపగ్రహాలను లో-ఎర్త్ ఆర్బిట్‌లోకి ఈ రాకెట్ తీసుకెళ్లిందని తెలిపారు. భారత అంతరిక్ష పరిశోధన రంగంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని వెల్లడించారు. ఇస్రో నుంచి తొలిసారిగా స్కైరూట్ ఏరోస్పేస్ విక్రమ్-1 ప్రైవేట్ రాకెట్‌ను ప్రయోగించారని తెలిపారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్‌ను, శాస్త్రవేత్తలను మంత్రి లోకేశ్ అభినందించారు.

# మరో చారిత్రక మైలురాయికి ఇస్రో

**విక్రమ్-1' రాకెట్ ప్రయోగంపై చంద్రబాబు హర్షం**

**అమరావతి,జులై18(జై భీమ్ న్యూస్):**

'విక్రమ్-1' రాకెట్ తొలి ప్రయోగంలోనే విజయం సాధించడంపై సీఎం చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్-స్పేస్, ఎన్ఎస్ఐఎల్‌లకు ఎక్స్ వేదికగా అభినందనలు తెలియజేశారు. విక్రమ్-1 తొలి ప్రయోగంలోనే విజయవంతంగా కక్ష్యలోకి చేరడంతో భారత్ మరో చారిత్రక మైలురాయిని అధిగమించిందన్నారు. ప్రపంచంలోని అత్యుత్తమ దేశాలతో పోటీపడే స్థాయికి భారత ప్రైవేటు అంతరిక్ష రంగం ఎదిగిందని ఈ విజయం నిరూపించిందని వెల్లడించారు. ఇది భారత అంతరిక్ష రంగంలో ఒక నూతన యుగానికి నాంది అని పేర్కొన్నారు. శాస్త్రీయ సంస్థల సామర్థ్యం, భారతీయ పారిశ్రామికవేత్తల సృజనాత్మకత కలిసినప్పుడు ఆవిష్కరణలకు కొత్త హద్దులు ఏర్పడతాయని ఈ ఘన విజయం చాటిచెప్పిందని సీఎం తెలిపారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇస్రో, ఇన్-స్పేస్, ఎన్ఎస్ఐఎల్ సహా ఈ విజయాన్ని సాకారం చేసిన వేలాదిమంది శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, భాగస్వామ్యులందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ విజయం ప్రతి భారతీయుడు గర్వపడే క్షణమన్నారు. భావితరాల యువ శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలకు గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. నక్షత్రాల వైపుగా భారత్ సాగిస్తున్న ప్రస్థానం మరిన్ని విజయాలతో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

# వాంగ్‌చుక్ తరలింపుతో దీక్షకు దిగిన దీప్కే

**ఈ ఉద్యమం ఎట్టి పరిస్థితుల్లో ఆగిపోదని వెల్లడి**
**20న సంసద్ మార్చ కొనసాగుతుందని స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ,జూలై18(జై భీమ్ న్యూస్):**


పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించడంతో ఈ ఉద్యమం ఆగిపోదని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. ఇక నుంచి తాను నిరవధిక నిరాహార దీక్ష చేస్తానని ప్రకటించారు. ఈ రోజు నుంచి దీక్ష ప్రారంభిస్తున్నాను. వెనకడుగు వేయొద్దని మద్దతుదారులకు విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రతి ఒక్కరు జంతర్‌మంతర్‌కు రావాలని కోరుతున్నాను. జులై 20న జరగాల్సిన పాదయాత్రను కొనసాగిస్తాం అని వెల్లడించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కొన్ని వారాల క్రితం కాక్రోచ్ పార్టీ తొలుత దిల్లీలో నిరసనలు ప్రారంభించింది. ఈ క్రమంలోనే వాంగ్‌చుక్ నిరాహార దీక్ష ప్రారంభించారు. జులై 20న పార్లమెంట్‌కు శాంతియుత మార్చ్ 'చలో సంసద్'ను నిర్వహించనున్నట్లు కాక్రోచ్ పార్టీ ఇప్పటికే ప్రకటించింది. ఆ రోజునే పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం వాంగ్‌చుక్‌ను ఉంచిన సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రకటన విడుదల చేశారు. నిరాహార దీక్ష కారణంగా ఆయన బలహీనపడ్డారు. డీహైడ్రేషన్‌కు గురయ్యారు. నిరంతర వైద్యపర్యవేక్షణ, చికిత్స అందిచాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. మరోవైపు ఆసుపత్రిలోకి ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతించకపోవడంతో అక్కడి సిబ్బందిపై వాంగ్‌చుక్ భార్య ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే వాంగ్‌చుక్ వైద్య పరీక్షల వివరాల కాపీ ఇవ్వకపోవడానికి కారణం ఏంటని ప్రశ్నించారు.

# 'విక్రమ్-1' విజయవంతంపై ప్రధాని మోడీ హర్షం

**స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి ఫోన్‌లో అభినందనలు**
**ఇంజనీర్ల కృషిని ప్రశంసిస్తూ..తనను కలవాలని సందేశం**

**న్యూఢిల్లీ,జులై18(జై భీమ్ న్యూస్):**

భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతమైన వెంటనే హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ బృందంతో ఫోన్‌లో మాట్లాడి, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు మోదీ. ఈ ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించినట్టు చెప్పిన ఆయన.. ఈ ఘనత దేశానికి గొప్ప విజయమని అభివర్ణించారు. భారత అంతరిక్ష ప్రయాణంలో ఇదో కీలక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. 'ప్రయోగాన్ని నేను ప్రత్యక్షంగా వీక్షించాను. దీని వెనుక ఎందరో యువ ఇంజినీర్ల శ్రమ దాగుంది. మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు. ఇది ఆరంభం మాత్రమే. ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి' అని స్కైరూట్ టీమ్‌ను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల బృందం త్వరలో తనను కలవాలని ఫోన్ ద్వారా ఆహ్వానించారు. అంతరిక్ష రంగంలో భారత్ స్వావలంబన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఈ ప్రయోగం ప్రపంచానికి చాటిచెప్పిందని మోదీ అభిప్రాయపడ్డారు. 'అంతరిక్ష రంగంలోనూ భారత్ ఆత్మనిర్భర్‌గా ఎదగగలదని మీరు ప్రపంచానికి నిరూపించారు' అని ప్రధాని కొనియాడారు. 'విక్రమ్-1'లో తన 'వందేమాతరం' సందేశంతో కూడిన కార్డును కూడా పంపించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన శుభాకాంక్షలు సహా ఆ సందేశం కూడా అంతరిక్షంలోకి చేరడం గర్వకారణమన్నారు. 'ఈ ప్రయోగం ద్వారా 'వందేమాతరం' సందేశం మరింత ఉన్నత స్థాయికి చేరి అంతరిక్షంలోనూ మార్మోగింది' అని మోదీ వ్యాఖ్యానించారు. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు 'మిషన్ ఆగమన్' పేరిట చేపట్టిన 'విక్రమ్-1' రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. నిర్ణీత సమయం కంటే 35 నిమిషాలు ఆలస్యంగా ప్రయోగం చేపట్టినప్పటికీ.. అన్ని దశలను విజయవంతంగా పూర్తి చేయడంతో భారత ప్రైవేటు అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది.



# నేను ఎప్పుడూ పదవులు అడుకోను

**నా నిర్ణయాలన్నీ సంచలనంగానే ఉంటాయి**
**ఎమ్మెల్యే రాజగోపాలరెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్,జూలై18(జై భీమ్ న్యూస్):**

నేను ఎప్పుడూ పదవులు అడుక్కోను.. నేనొక ఫైటర్‌ను. నేను ఏ నిర్ణయం తీసుకున్నా అది ఒక రెవల్యూషన్ లాగే ఉంటుందని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే.. తనను ఓడించడానికి వంద మంది ఎమ్మెల్యేలు మునుగోడుకు వచ్చారని, అలాగే ఎమ్మెల్సీ పోటీలో తాను నిలబడితే ఆనాడు కేసీఆర్‌కు నిద్ర కూడా పట్టలేదని తన రాజకీయ రికార్డును గుర్తుచేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మీడియా ప్రతినిధులతో జరిపిన చిట్‌చాట్‌లో సంచలన వ్యాఖ్యలు చేశారు. తన మంత్రి పదవి, కుటుంబంలో ఇద్దరికి పదవుల అంశంపై వస్తున్న విమర్శలపై ఆయన తనదైన శైలిలో స్పందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడకముందు జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ.. ఎన్నికల ముందు ఏఐసీసీ నాయకత్వం ఆరుగురు సీనియర్లకు మంత్రి పదవులు ఇస్తామని హామీ ఇచ్చిందని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. 'హైకమాండ్ ఆరుగురిలో ఐదుగురికి మంత్రి పదవులు ఇచ్చింది. కానీ నా ఒక్కడికే ఇవ్వలేదు. అలాగని నేను పదవి కోసం అడుక్కునే టైం ఇది కాదు' అని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి పదవి దక్కకపోవడంపై తన అంతరంగాన్ని ఆయన ఈ సందర్భంగా బయటపెట్టారు. సొంత అన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇప్పటికే క్యాబినెట్ మంత్రిగా ఉన్నందున, 'ఒకే కుటుంబానికి ఒకే పదవి' అనే నిబంధన వల్లే రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి దక్కలేదనే ప్రచారంపై ఆయన తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫ్యామిలీ రూల్స్ పై స్పందిస్తూ.. భార్యాభర్తలు మాత్రమే ఒక కుటుంబం కిందకు వస్తారు. కానీ అన్నాదమ్ములు ఒకే కుటుంబం ఎలా అవుతారని ప్రశ్నించారు. దీనికి ఉదాహరణగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులను ప్రస్తావిస్తూ.. 'ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన భార్య పద్మావతి ఇద్దరూ ఒకే ఫ్యామిలీ అవుతారు. కానీ మేము అన్నదమ్ములం, ఇద్దరం వేర్వేరు ఇళ్లలో ఉంటున్నాం. అలాంటప్పుడు అన్న, నేను ఇద్దరం ఒకే కుటుంబం అంటే ఎలా కుదురుతుందని రాజగోపాల్ రెడ్డి నిలదీశారు. భిన్నమైన ఇళ్లలో ఉంటూ రాజకీయంగా విడివిడిగా కష్టపడుతున్న తమకు ఈ నిబంధన వర్తింపజేయడం సరికాదనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు.



# జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన

**ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా కమిటీ కుర్రోళ్లు ఎంపి**
**విజువల్ వండర్ 'కల్కి 2898 ఏడీ'కి రెండు కేటగిరీల్లో అవార్డులు**

**న్యూఢిల్లీ,జూలై18(జై భీమ్ న్యూస్):**

72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు చిత్రాలు అదరగొట్టాయి. 2024 సంవత్సరానికి గానూ వివిధ కేటగిరీల్లో పలు తెలుగు చిత్రాలకు అవార్డులు దక్కాయి. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కమిటీ కుర్రోళ్ళు' ఎంపికైంది. అంతేకాదు, ఉత్తమ మేకప్ విభాగంలోనూ అవార్డు వరించింది. కొత్త నటులతో దర్శకుడు యదువంశీ రూపొందించి ఈ చిత్రానికి మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా వ్యవహరించడం విశేషం. బాక్సాఫీస్‌తో పాటు ఓటీటీలోనూ అదరగొట్టిన ఈ మూవీ ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో జాతీయ సమైక్యత, మతసామరస్యం, అణగారిన వర్గాల సామాజిక అభ్యున్నతికి ఉద్దేశించిన చిత్రంగా వివిధ విభాగాల్లో మెరిసింది. ఇక నాగ్ అశ్విన్ విజువల్ వండర్ 'కల్కి 2898 ఏడీ'కి రెండు కేటగిరీల్లో అవార్డులను దక్కించుకుంది. అద్భుతమైన సెట్స్, విజువల్స్‌తో అలరించినందుకు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ అవార్డుతో పాటు, ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. 'ఎంత గొప్పగా ఆడావు అన్నది ముఖ్యం కాదు.. ఎప్పుడు ఆపావన్నదే ముఖ్యం, 'ఒక్క రోజులో ఒక అరగంట నాకు నచ్చినట్టు గడవలేదు. దానికి జీవితాంతం ఏడుస్తూ కూర్చోలేను కదా' వంటి సంభాషణలతో అలరించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. ఇలాంటి అద్భుతమైన సంభాషణలను రాసి జీవిత సత్యాలెన్నో చెప్పిన దర్శకుడు వెంకీ అట్లూరి ఉత్తమ రచయితగా జాతీయ అవార్డు దక్కింది. మాస్‌నే కాదు, బాక్సాఫీస్‌ను ఓ ఊపు ఊపేసిన చిత్రం 'పుష్ప2'. ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ మూవీని ఆద్యంతం అలరించేలా తీర్చిదిద్దిన దర్శకుడు సుకుమార్ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత కేటగిరిలో అవార్డుకు ఎంపిక కాగా, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్‌గా దీపాలి నూర్, సీతల్ శర్మలకు అవార్డు దక్కింది. చిన్న చిత్రం కాదు.. ప్రతి ఒక్కరి మనసుల్ని హత్తుకునేంత పెద్ద చిత్రమనించింది '35- చిన్న కథ కాదు'. ఇప్పుడు జాతీయ అవార్డుల్లో ఉత్తమ బాలల చిత్రంతో పాటు, ఉత్తమ బాల నటుడిగా అరుణ్‌దేవ్ పోతుల అవార్డుకు ఎంపికయ్యారు.




# దొరల గడీల ముందు మోకరిల్లని కవి అందెశ్రీ

**అందెశ్రీని, గద్దర్‌ను అవమానించిన కెసిఆర్**
**వేల ఎకరాల్లో ఫామ్‌హౌజ్‌లతో కులకుతున్న నేతలు**
**నేనున్నంత వరకు బిఆర్ఎస్ అధికారంలోకి రావడం కల్ల**
**నిరుద్యోగులను మోసం చేసిన ఘనులు బిఆర్ఎస్ నేతలు**
**అందెశ్రీ స్మృతివనం శంకుస్థాపనలో సిఎం రేవంత్ విమర్శలు**

**హైదరాబాద్,జూలై18(జై భీమ్ న్యూస్):**

దొరల గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పిన కవి అందెశ్రీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కవిగా, గాయకుడిగా తెలంగాణ సమాజానికి సుపరిచితులైన ఆయన.. తనకు ఆత్మబంధువని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో 'అందెశ్రీ స్మృతివనం' నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందెశ్రీని ఆనాటి ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రజా గాయకుడు గద్దర్‌ను కూడా ప్రగతిభవన్ గేటు ఎదుట ఎర్రటి ఎండలో నిలబెట్టారని విమర్శించారు. వారిద్దరన్నీ అవమానించినప్పుడే దొరలను సాగనంపాలని జనం నిర్ణయించుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం, ఆయన తనకు ఆత్మబంధువని, కుటుంబ సభ్యుడిగా, పెద్దన్నగా భావించానని అన్నారు. అందెశ్రీ పాటలు లక్షలాది మందిలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపాయని, తనలోనూ ఉద్యమ చైతన్యాన్ని రగిలించాయని పేర్కొన్నారు. గడీల ముందు మోకరిల్లనని చెప్పిన కవి అందెశ్రీ ఎప్పుడూ దొరల గడప తొక్కలేదని, ఆయన గానంలో గొప్పతనం, సమాజానికి మార్గనిర్దేశం చేసే శక్తి ఉందన్నారు. ఒకప్పుడు నిర్బంధానికి గురైన అందెశ్రీ పాటే నేడు తెలంగాణ రాష్ట్ర గీతంగా మారడం చారిత్రక విషయమని చెప్పారు. ఆనాటి ప్రభుత్వం అందెశ్రీని అవమానించిందని, అలాగే ప్రజాకవి గద్దర్‌ను ప్రగతిభవన్ ఎదుట ఎండలో నిలబెట్టిన ఘటనను కూడా సీఎం గుర్తు చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. గ్రూప్ పరీక్షలు నిర్వహించి నిజంగా ఉద్యోగాలు ఇచ్చారా అని ప్రశ్నించారు. కేవలం నోటిఫికేషన్లు ఇచ్చి పేపర్లు లీక్ చేయడం ద్వారా కోట్లు సంపాదించారని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులు, బంధువులకే ఉద్యోగాలు, పదవులు కట్టబెట్టారని, కష్టపడి చదివిన నిరుద్యోగులను నిరాశపరిచారని విమర్శించారు. గతంలో ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలను ప్రస్తావించిన సీఎం, తెలంగాణను శవాలమయంగా మార్చింది ఎవరో ప్రజలకు తెలుసని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్న ఆయన, గత ప్రభుత్వం రాష్ట్రానికి రూ. 8 లక్షల కోట్ల అప్పులు మిగిల్చి ఫామ్‌హౌస్ రాజకీయాలు చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ నోటిఫికేషన్లు ఇస్తే ఈ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చిందని ప్రతిపక్ష నేతలు నిస్సిగ్గుగా చెబుతున్నారని సీఎం మండిపడ్డారు. నిరుద్యోగులు, ఉద్యోగ నియామకాల గురించి ఒక్క రోజైనా బీఆర్ఎస్ పాలకులు ఆలోచించారా? 16 ఏళ్ల తర్వాత.. మేం అధికారంలోకి వచ్చాక గ్రూప్-1 నిర్వహించాం. బీఆర్ఎస్ పాలనలో ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలిచ్చాం. తల్లిదండ్రుల సాక్షిగా వారందరికీ ఉద్యోగ నియామక పత్రాలిచ్చాం. కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ సమాజం శ్రీమంతుల్ని చేసింది. అలాంటి రాష్ట్రానికి వాళ్లు తిరిగి ఏమిచ్చారు? ఉన్నదంతా దోచుకున్నారు. కేసీఆర్ 1000 ఎకరాల్లో, కేటీఆర్ 100 ఎకరాల్లో, హరీశ్‌రావు 50 ఎకరాల్లో, కవిత 25 ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. మీరు నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎలా మారారు? కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు అప్పుడే క్షమించారని అనుకుంటున్నారా? నేను ఉన్నంతవరకు మరోసారి మీ సర్కారును రానివ్వను. తెలంగాణను దోచుకోవాలని చూస్తే.. అందెశ్రీ మళ్లీ పాటై పుడతాడని రేవంత్‌రెడ్డి అన్నారు.

# స్కైరూట్ మన టీ హబ్‌లోనే పుట్టింది

**విక్రమ్ విజయవంతంపై కెటిఆర్ అభినందనలు**

**హైదరాబాద్,జూలై18(జై భీమ్ న్యూస్):**

టి హబ్ వేదికగా ఏర్పడ్డ స్కైరూట్ సంస్థ శ్రీహరికోటలో చేపట్టిన విక్రమ్-1 రాకెట్ ప్రయోగ విజయవంతం కావడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్ సరూర్ నగర్‌లో తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ మాట్లాడుతూ.. టీ హబ్‌లో పురుడు పోసుకున్న కంపెనీ పేరు స్కైరూట్. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏండ్లు అయింది. ఇవాళ భారతదేశ చరిత్రలో ఒక ప్రైవేట్ రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపిన ఆ కంపెనీ మన టీహబ్ నుంచే వచ్చిందన్నారు. ఇవాళ ఉదయమే ప్రయోగం విజయవంతంగా నిర్వహించారు. ఈ రోజు శ్రీహరికోట నుంచి ప్రైవేట్ రాకెట్‌ను పంపిన స్కైరూట్ కంపెనీకి చప్పట్లతో అభినందనలు తెలుపాలని కేటీఆర్ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు. ఇస్రో నుండి తొలిసారి ప్రైవేట్ రాకెట్ ప్రయోగం సక్సెస్ అవడంతో స్కైరూట్ కంట్రోల్ సెంటర్‌లో సంబురాలు చేసుకుంటున్నారు.

# 21న బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

**ఏర్పాట్లపై అధికారులతో తలసాని సమీక్ష**

**హైదరాబాద్,జూలై18(జై భీమ్ న్యూస్):**



ఈ నెల 21న నిర్వహించనున్న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం, 22న జరగనున్న రథోత్సవం సందర్భంగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. శనివారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఏర్పాట్లపై చర్చించారు. ఈ వేడుకలకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలివస్తారని వెల్లడించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. ప్రజలు సంతోషంగా జరుపుకునే వేడుకకు ఆంక్షలు పెట్టి ఇబ్బందులు పెట్టొద్దని అధికారులకు స్పష్టం చేశారు. ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని, నిరంతర పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. భక్తులు తోపులాటకు గురికాకుండా పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రథోత్సవం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ పరిసరాలలో ప్రత్యేక హెల్త్ క్యాంప్ లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బల్కంపేట ఎల్లమ్మ ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ ఈవో వినోద్ రెడ్డి, డీసీ సుజాత, వాటర్ వర్క్స్ జీఎం సతీష్, ఎలక్ట్రికల్ డీఈ కిషోర్, ఆర్ అండ్ బి డీఈ మనోహర్, లా అండ్ ఆర్డర్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గర్భిణి మృతి

**కర్నూలు,జూలై18(జై భీమ్ న్యూస్):**

రోడ్డు ప్రమాదంలో ఐదు నెలల గర్భిణి మృతి చెందింది. ఈ ఘటన శనివారం కర్నూలు నగర సమీపంలోని పంచలింగాల చెక్‌పోస్టు వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే.. అనంతపురం నుంచి హైదరాబాద్‌కు ఓ ఆర్టీసీ బస్సు బయలుదేరింది. అదే సమయంలో తండ్రి రాముడు, ఆయన కుమార్తె ప్రియాంక ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఒక్కసారిగా బైక్ అదుపుతప్పడంతో వారిద్దరూ కిందపడ్డారు. బస్సు మహిళపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా.. రాముడు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రుడ్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కర్నూలు జిల్లా గడివేములకు చెందిన ప్రియాంకను తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా మద్దూరు గ్రామానికి చెందిన బజారితో వివాహం జరిగింది. ప్రస్తుతం ప్రియాంక ఐదు నెలల గర్భిణి. రాముడు ప్రియాంకను కాన్పుకోసం పుట్టింటికి తీసుకెళ్తుండగా.. ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బహదూర్‌గూడాలో మరోమారు ఉద్రిక్తత

**పోలీసులపై కారం చల్లి..కుర్చీలతో దాడి**

**రంగారెడ్డి,జూలై18(జై భీమ్ న్యూస్):**

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధిలోని బహదూర్‌గూడలో మరోసారి ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇక్కడి ప్రభుత్వ భూమికి హైడ్రా అధికారులు ఫెన్సింగ్ వేయడంతో స్థానికులు ఆందోళనకు దిగారు. భూములు సాగు చేసుకుంటున్న తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆందోళనకారులు పోలీసులపైకి కారం చల్లి, కుర్చీలు విసిరేశారు. డీసీపీ యోగేశ్ గౌతమ్‌తో సహా పలువురు సీఐల కళ్లలో కారం పడింది. ఈ క్రమంలో రైతులకు మద్దతిస్తున్న నేతలను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులపై కారం చల్లి, కుర్చీలు విసరడం సరికాదని డీసీపీ యోగేశ్ గౌతమ్ అన్నారు. ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ మాత్రమే వేస్తున్నామని, సాగులో ఉన్న పంటను పాడు చేయడం లేదని అన్నారు. రైతులు శాంతియుతంగా నిరసన తెలపాలని కోరారు. ఉదయం కూడా రైతులు ఇక్కడ ఆందోళన చేపట్టారు. బు÷-లలెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం సేకరించిన స్థలంలో కంచె వేసేందుకు వెళ్లిన రెవెన్యూ, హైడ్రా అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. 650 ఎకరాల భూమికి హైడ్రా సాయంతో కంచె వేసేందుకు వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. కంచె వేయడాన్ని నిరసిస్తూ ఆర్డీవో శ్రీధర్‌తో స్థానికులు వాగ్వాదానికి దిగారు. ఉదయం నుంచి నిరసనలు కొనసాగుతుండగా.. తాజాగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి.

# భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవు

**అందరం కలసి అధికారం కోసం కృషి చేస్తున్నాం**
**బండి సంజయ్, ఈటెల మధ్య సయోధ్యకు యత్నం**
**ఎంపి లక్ష్మణ్ నివాసంలో ఇద్దరు నేతలతో అభయ్ పాటిల్ చర్చలు**
**తెలంగాణలో అధికారం బిజెపిదేనన్న ఎంపి లక్ష్మణ్**

**హైదరాబాద్,జూలై18(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవని, అందరం కలసి అధికారం కోసం కృషి చేస్తున్నామని బిజెపి ఎంపి లక్ష్మణ్ అన్నారు. బండి సంజయ్, ఈటెల రాజేందర్ మధ్య ఉన్న విభేదాలపై ఆయన స్పందించారు. కీలక నేతల మధ్య విభేదాలపై అధిష్ఠానం దృష్టి సారించింది. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ తో ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్ భేటీ అయ్యారు. ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఇరువురు నేతలతో గంట పాటు సమావేశం జరిగింది. పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని అభయ్ పాటిల్ వారికి సూచించారు. కరీంనగర్ నియోజకవర్గానికి సంబంధించిన అంశాల్లో ఇద్దరూ కలిసి పని చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే.. అంతర్గతంగా పరిష్కరించుకోవాలని ఆదేశించారు. అనంతరం ఇరువురు నేతలతో కలిసి ఎంపీ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో భాజపాను అధికారంలోకి తీసుకురావడంపై చర్చించినట్లు తెలిపారు. ప్రజలకు కాంగ్రెస్‌పై కోపం ఉందని, అలాగే బీఆర్ఎస్‌పై నమ్మకం లేదని తెలిపారు. వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ, లోక్‌సభ సీట్లు పెరుగుతాయని, జమిలి ఎన్నికలు జరుగుతాయన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. భాజపాను అధికారంలోకి తెచ్చేందుకు తామంతా కలిసి పనిచేస్తామని వివరించారు. తెలంగాణలో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న బీజేపీ.. ఆ దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఈ క్రమంలోనే నేతల మధ్య విభేదాలను తొలగించి.. అందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. ఎంతో కాలంగా విభేదాలతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చారు. వీరిద్దరి మధ్య రాజీ కుదిర్చేందుకు రంగంలోకి దిగిన బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్.. నేడు ఈటల రాజేందర్, బండి సంజయ్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదికగా జరిగిన ఈ సమావేశంలో ఈటల, బండి మధ్య రాజీ కుదిర్చారు. విభేదాలు పక్కనపెట్టి.. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చే దిశగా కృషి చేయాలని ఇద్దరు నేతలకు అభయ్ పాటిల్ దిశానిర్దేశం చేశారు. భేటీ అనంతరం మీడియా ముందుకు బీజేపీ నేతలు.. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందంటూ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

# రామ్‌చరణ్-సుకుమార్ కాంబో




## ఆర్17 పట్టాలకెక్కనుందని ప్రచారం

ఈ ఏడాది పెద్ది సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్న రాంచరణ్ మరోమారు సుకుమార్‌తో సినిమాకు సిద్ధం అవుతున్నారు. వీరి కాంబో రంగస్థలం బాక్సాఫీస్‌ను షేక్ చేసిందని తెలిసిందే. ఈ ఇద్దరి క్రేజీ కాంబోలో మరోసారి ఆర్‌సీ 17సందడి చేసేందుకు రెడీ అవుతోంది. మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం ఆర్‌సీ17 మూవీ ఫైనల్ స్క్రిప్ట్ పూర్తయింది. మేకర్స్ త్వరలోనే గ్రాండ్‌గా ఈ సినిమాను షురూ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అన్నీ అనుకున్నట్టు కుదిరితే వచ్చే సెప్టెంబర్‌లోనే సినిమా లాంచ్ కానుందట. అంతేకాదు నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. రంగస్థలం తర్వాత సుకుమార్-రాంచరణ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని వార్తలు రాగా.. మరోవైపు ధురంధర్ శశ్వత్ సచ్‌దేవ్ పేరు కూడా తెరపైకి వచ్చింది. రాంచరణ్ నిర్మాతగా నిఖిల్ హీరోగా నటిస్తోన్న ఇండియా హౌస్ చిత్రానికి కూడా శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తున్నాడు.

# ప్రియాంకచోప్రా బర్త్‌డే

### విషెస్ చెబుతూ వారణాసి లుక్ విడుదల



మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న చిత్రం 'వారణాసి'లో మహేశ్‌కు జోడీగా బాలీవుడ్ నటి ప్రియాంక కనిపించనున్న విషయం తెలిసిందే. మందాకిని పాత్రలో ఆమె సందడి చేయనున్నారు. శనివారం ఆమె పుట్టినరోజు సందర్భంగా సినిమా సెట్‌లోని ఫొటోలను విడుదల చేస్తూ రాజమౌళి పోస్ట్ పెట్టారు. 'ఆమె నవ్వితే అందం.. నవ్వకపోతే నిప్పు కణిక' అనే క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహేశ్ కూడా ప్రియాంకకు విషెస్ చెప్పారు. 'మా ఒకే ఒక్క మందాకినికి హ్యాపీ బర్త్‌డే..' అని పోస్ట్ పెట్టారు. ప్రియాంక 'వారణాసి' కోసం 14 నెలల నుంచి షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఇందులో అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చేసినట్లు ఆమె చెప్పారు. ఇక ఈ చిత్రంలో రుద్ర, శ్రీరాముడిగా మహేశ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ప్రపంచంతో పాటు కాలాల్ని చుట్టేసే సాహసికుడి కథగా ఇది ముస్తాబవుతున్నట్లు తెలిసిందే. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రానున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ ఏడాది అక్టోబర్ నాటికి చిత్రీకరణ పూర్తి చేసి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ప్రియాంక చోప్రా ఫొటోస్ రిలీజ్ నేపథ్యంలో సోషల్ మీడియాలో మరోసారి ఆసక్తికర ప్రచారం మొదలైంది. మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 9న వారణాసి తొలి గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు అభిమానులు, ఫ్యాన్ పేజీలు పెద్ద ఎత్తున పోస్టులు చేస్తూ హల్‌చల్ చేస్తున్నాయి. 'బాబు బర్త్‌డేకు భారీ సర్‌ప్రైజ్', 'బాబు బర్త్‌డేకు గ్లింప్స్ లోడింగ్'. 'ఆగస్టు 9న ఇంతకుముందెన్నడూ చూడని హైప్ చూడబోతున్నారు' అంటూ అభిమానులు సోషల్ మీడియా వేదికగా పోస్టులు షేర్ చేస్తున్నారు. దీంతో హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండింగ్‌లో ఉన్నాయి.

## ఇన్‌స్టాలో దుమ్మురేపిన ఫౌజీ

### ఫస్ట్‌లుక్ విడుదల కాగానే 5.33 లక్షల లైక్స్




రెబల్ స్టార్ ప్రభాస్ సినిమా అంటే థియేటర్లలో మాత్రమే కాదు, సోషల్ మీడియాలోనూ అభిమానుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో మరోసారి నిరూపితమైంది. తాజాగా విడుదలైన ఫౌజీ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డును నమోదు చేసి, భారతీయ సినీ ప్రమోషన్లకు కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. తాజా గణాంకాల ప్రకారం, 'ఫౌజీ' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైన తొలి 24 గంటల్లోనే ఏకంగా 5.33 లక్షల షేర్లు సాధించింది. దీంతో ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధికంగా షేర్ చేయబడిన సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌గా ఇది కొత్త రికార్డును సృష్టించింది. అభిమానులు ఈ పోస్టర్‌ను భారీ స్థాయిలో షేర్ చేస్తూ సోషల్ మీడియాలో ఒక డిజిటల్ వేడుకలా మార్చేశారు. ఈ రికార్డు ప్రభాస్ డిజిటల్ క్రేజ్‌కు మరో నిదర్శనంగా మారింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈసారి ప్రభాస్ మరో హీరో రికార్డును కాదు, తన సొంత రికార్డునే బద్దలు కొట్టారు. గతంలో 'స్పిరిట్' ఫస్ట్ లుక్ పోస్టర్ 5.19 లక్షల షేర్లతో అగ్రస్థానంలో ఉండగా, ఇప్పుడు 'ఫౌజీ' దానిని అధిగమించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో సోషల్ మీడియాలో ప్రభాస్ ఆధిపత్యం మరింత బలపడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పోస్టర్ అభిమానులను అంతగా ఆకట్టుకోవడానికి ప్రధాన కారణం అందులో కనిపించిన ప్రభాస్ లుక్. ఒక వార్ ్గ÷ట్ లో గాయాలతో కూర్చుని ఉన్న ఆ రూపం చాలా క్రేజీగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్‌కు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఫస్ట్ లుక్‌తో వచ్చిన ఈ రికార్డు సినిమా చుట్టూ ఉన్న హైప్‌ను మరింత పెంచింది. ప్రభాస్ అభిమానులతో పాటు, సినీ ప్రేక్షకులు కూడా ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియడ్ వార్ డ్రామాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ప్రభాస్ పవర్‌ఫుల్ రోల్ లో తెరకెక్కుతున్న ఈ మూవీ డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో ఇప్పటికే 'ఫౌజీ' సృష్టిస్తున్న సంచలనం చూస్తుంటే, ఈ సినిమా కోసం అభిమానులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో స్పష్టంగా తెలుస్తోంది.

## నాని ప్యారడైజ్‌కు భారీ డిమాండ్




నాచురల్ స్టార్ నాని నటిస్తున్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్' విడుదలకు ముందే ట్రేడ్ వర్గాల్లో భారీ రికార్డ్స్ సృష్టిస్తుంది. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో నాని మరోసారి జతకట్టడంతో ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఈ చిత్రం థియేట్రికల్ బిజినెస్‌లో కొత్త రికార్డులు సృష్టిస్తుంది. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం.. 'ది ప్యారడైజ్' నైజాం థియేట్రికల్ హక్కులను మైత్రీ డిస్ట్రిబ్యూటర్స్ రూ.37 కోట్లకు సొంతం చేసుకుంది. నాని కెరీర్‌లో ఇప్పటివరకు ఏ చిత్రానికీ ఈ స్థాయిలో నైజాం బిజినెస్ జరగకపోవడంతో ఇది రికార్డు డీల్‌గా నిలిచింది. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీ ఆఫర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## ఓటిటిలోకి బాలన్..ది బాయ్




'మంజుమ్మల్ బాయ్స్' చిత్రంతో మలయాళంతో పాటు తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు చిదంబరం. ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'బాలన్ – ది బాయ్'. చందు సలీమ్ కుమార్, టొవినో థామస్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జులై 31 నుంచి జీ5 వేదికగా స్ట్రీమింగ్ కానుంది. మలయాళంతో పాటు తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో అందుబాటులోకి రానుంది. హత్య కేసులో జైలుకు వెళ్లిన మహిళ  అక్కడ ఓ అబ్బాయికి జన్మనిస్తుంది. శిక్ష పూర్తయి బయటకు వచ్చాక తన గతం గురించి ఎవరికీ చెప్పకుండా మారుపేర్లతో అన్ని ప్రాంతాలు తిరుగుతూ ఉంటుంది. కల్లోలభరితమైన బాల్యం, ఆ తర్వాత అదృశ్యమైన తన తల్లి కోసం వెతుకుతున్న ఒక టీనేజ్ అబ్బాయి కథగా 'బాలన్ – ది బాయ్' రూపొందింది. మే నెలలో జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. సినీ ప్రముఖులు సూర్య, నాగచైతన్య తదితరులు ఈ సినిమాపై ప్రశంసలు కురిపించారు.